
నేటి నుంచి భూ భారతి

- జిల్లాలో 380 రెవెన్యూ గ్రామాల్లో సదస్సులు
- పెండింగ్‌లో 1,576 దరఖాస్తులు
- నేటి మొలుగుమాడు సదస్సుకు డిప్యూటీ సీఎం భట్టి, రెవెన్యూ మంత్రి పొంగులేటి

2

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఖమ్మం
KHAMMAM
మంగళవారం, 3 జూన్ 2025





ఖమ్మంలో విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శన

అమరుల త్యాగాల స్ఫూర్తితో అభివృద్ధి



ఖమ్మం పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో జరిగిన వేడుకల్లో జాతీయ జెండాను ఆవిష్కరించి.. మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి

- చిత్తశుద్ధితో ప్రజల వద్దకు ప్రభుత్వ పథకాలు
- 'సీతారామ'తో ఉమ్మడి జిల్లా సస్యశ్యామలం
- రైజింగ్ 2047విజన్‌తో ముందుకెళ్తున్నాం
- గిరిజన భూముల సాగు కోసం ఇందిర సౌర గిరిజల వికాసం
- హైవేలు, రైల్వేలైన్ల మంజూరుతో మారుతున్న రూపురేఖలు
- రాష్ట్ర ఆవిర్భావ వేడుకల్లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి తుమ్మల నాగేశ్వరావు
- ఖమ్మంలో పతాకావిష్కరణ చేసిన భట్టి.. కొత్తగూడెంలో జెండా ఎగురవేసిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

5



కొత్తగూడెం ప్రగతి మైదానంలో జాతీయ జెండాను ఆవిష్కరించి.. ప్రసంగిస్తున్న వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల

జేఈఈ అడ్వాన్స్‌లో న్యూవిజన్ ప్రభంజనం



ర్యాంకులు సాధించిన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

ఖమ్మం ఖానాపురం హవేలి, జూన్ 2(ఆంధ్రజ్యోతి): సోమవారం ప్రకటించిన జేఈఈ అడ్వాన్స్ ఫలితాల్లో నగరంలోని న్యూవిజన్ కళాశాల విద్యార్థులు ఓపెన్ కేటగిరీలో 497, కేటగిరీలో 5వ ర్యాంక్ సాధించి ప్రభంజనం సృష్టించారని విద్యా సంస్థల చైర్మన్ సీహెచ్‌జీకే ప్రసాద్ తెలిపారు. ఓపెన్ కేటగిరీలో కళాశాలకు చెందిన పేరాల ప్రణవ్ 497వ ర్యాంక్, కేటగిరీలో అజ్మీరా రోషిక్ మనిదీప్ 5వ ర్యాంక్‌తోపాటు వివిధ కేటగిరీల్లో భూక్య పీయూష్ వర్ధన్ 102, అజ్మీరా. జిగీష 204, ఆంగోత్ షామ్ 205, భూక్య యశ్వంత్ 394, గూడే కార్తిక్ సాయి 537, చంద్ర సాయి కృష్ణ 556, గుగులోతు షణ్ముక్ 562, తేజావత్ శ్రవంతి 605, బానోత్ వివేక్‌రామ్ 618, భూక్య ప్రతీక్ 678, స్వర్ణ మనస్విక్ 770, గంగావత్ చరన్‌తేజ్ నాయక్ 888, రామ కౌషిక్ 953, పగిడిపల్లి చేతన్ చంద్ర 977, కంసాని మధురహసిని చౌదరి 1026, భూక్య శివనాగచైతన్య 1093, పొట్టిమూతి ఠాగోర్ 1151, పల్ల రోహిత్ 1194, బదావత్ అన్షుల్ హేమ చంద్ర 1297, భూక్య శ్రీధన్‌తేజ్ 1323, బానోత్ కౌషిక్ 1377, ధరమ్‌సోత్ రాహుల్ నాయక్ 1427, వడ్లమూడి ఆశిష్ 1433, ఆల్ల హేమంత్ 1683, పండేటి యశస్విన్ 1797, వాంకుండోతు బిందుభాయ్ 1800, బానోతు. దీపిక 1941, బానోత్ మోహనసాయిలక్ష్మి 1962 వంటి అత్యుత్తమ ర్యాంకులు సాధించారని తెలిపారు. వివిధ కేటగిరీల్లో 1000లోపు 16 మంది, 5000లలోపు 65 మంది విద్యార్థులు ర్యాంకులు సాధించారని తెలిపారు. ఐఐటీలలో 44, ఎన్ఐటీలో 43, త్రిబుల్‌ఐటీ, బిట్‌స్యాట్‌లో 20, ఎంబీబీఎస్‌లో 41 మంది విద్యార్థులను ప్రతి ఏటా చేర్చడంలో న్యూవిజన్ అగ్రస్థానంలో ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ సీహెచ్ గోపీచంద్, అకాడమిక్ డైరెక్టర్ సీహెచ్ కార్తీక్, ప్రిన్సిపాల్ బ్రహ్మాచారి, శ్రీనివాసరావు, అధ్యాపకులు విద్యార్థులను అభినందించారు.

అడ్వాన్స్‌లో శ్రీచైతన్య విజయకేతనం



విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

ఖమ్మం ఖానాపురం హవేలి, జూన్ 2(ఆంధ్రజ్యోతి): సోమవారం ప్రకటించిన జేఈఈ అడ్వాన్స్ ఫలితాల్లో నగరంలోని శ్రీచైతన్య కళాశాల విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారని విద్యా సంస్థల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య తెలిపారు. వివిధ కేటగిరీల్లో కళాశాలకు చెందిన హెచ్ జశ్వంత్ రామ్ 9, ఎస్‌వి. వీరబ్రహ్మం 92, బి. లింగేష్ 144, వి. కుశాల్ 165, బి. విక్టోరియా 199, బి. జయంత్ 221, ఐ. అను 258, ఎం. జ్ఞానతిక్ లక్ష్మీ 270, డి. అంకితా 272, జి. కార్తీక్ 330, డి. రూపేష్ 370, ఎన్ జశ్మిత 375, బి. వరుణ్ సాయి 383, హెచ్. జీవన్ 456, బి. మృదున 478, జి. ఉదయ్‌కృష్ణ 502, జి. అమృతాహాసిని 527, బి. సింధు 538, బి. సిద్దార్థ 560, బి. వంశీ 598 వంటి అత్యుత్తమ ర్యాంకులు సాధించారని తెలిపారు. విజయాన్ని సాధించిన విద్యార్థులను చైర్మన్, డైరెక్టర్‌తోపాటు, అకాడమిక్ డైరెక్టర్ బి. సాయిగీతిక, చేతన్, బ్రహ్మం తదితరులు అభినందించారు.

కృష్ణవేణి ఐఐటీ మెడికల్ అకాడమీ విజయఢంకా



విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

ఖమ్మం ఖానాపురంహవేలీ, జూన్ 2(ఆంధ్రజ్యోతి): సోమవారం ప్రకటించిన జేఈఈ అడ్వాన్స్ ఫలితాల్లో నగరంలోని కృష్ణవేణి ఐఐటీ మెడికల్ అకాడమీ విద్యార్థులు విజయఢంకా మోగించారని కళాశాల డైరెక్టర్స్ గొల్లపూడి జగదీష్, మాచవరపు కోటేశ్వరరావు, యార్లగడ్డ వెంకటేశ్వరరావు తెలిపారు. కళాశాలకు చెందిన జె. జెస్వాంత్ 402, మణిచంద్రసాయి 418, బి. భాను ప్రసాద్ 598, కె. బన్నీ 732, బి. సంహిత 765, డి. రాజేశ్వరి 798, టి. దినేష్ 994, జి. వినీత 1109, జె. శివ చేతన్ 1154, డి. మహేశ్వర్ 1249, ఏ. సంయుక్త 1263, బి. రాహుల్ 1305, బి. చక్రవర్తి 1325, బి. పూజిత 1333, పి. మేఘన 1382, ఎస్. శివ శంకర వరప్రసాద్ 1384, బి. కృష్ణ ప్రసాద్ 1458, ఈ సుహాస్ 2261 వంటి అత్యుత్తమ ర్యాంకులు సాధించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గుర్రం. రాంచద్రయ్య, అకాడమిక్ ఇంచార్జ్ వంశీకృష్ణ, ఏవో నిరంజన్‌కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

అడ్వాన్స్‌లో హార్వెస్ట్ విజయభేరి



విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

ఖమ్మం ఖానాపురంహవేలీ, జూన్ 2(ఆంధ్రజ్యోతి): సోమవారం ప్రకటించిన జేఈఈ అడ్వాన్స్ ఫలితాలలో నగరంలోని హార్వెస్ట్ కళాశాల విద్యార్థులు విజయభేరి మోగించారని కళాశాల కరస్పాండెంట్ రవిమారుత్, ప్రిన్సిపాల్ పార్వతీరెడ్డి తెలిపారు. వివిధ కేటగిరీల్లో కళాశాలకు చెందిన విద్యార్థులు బి. సాయిచరణ్ 83, బి. సంజయ్ 207, ఎం. నాగయశ్వంత్ 393, బి. సిద్దార్థ 395, డి. శ్రీనివాస గౌతమ్‌రెడ్డి 686, వి. చరణ్ గోపాల్ స్వామి 1092, బి. మోక్షజ్ఞ 1159, పి. క్రిష్ సాత్విక్ 1163, ఎ. గణేష్ 1195, ఎన్‌సీహెచ్. జస్వంత్ సాయి 1268, ఎన్. రాఘవేంద్ర నవనీత్ 2108, పి. ప్రేమ్ వర్ధన్ 5078, వి. సాయిదీపక్ 6001 వంటి అత్యుత్తమ ర్యాంకులు సాధించారని తెలిపారు.

అడ్వాన్స్‌లో రెజోనెన్స్ ప్రభంజనం



విద్యార్థులను అభినందిస్తున్న డైరెక్టర్లు

ఖమ్మం ఖానాపురంహవేలీ, జూన్ 2(ఆంధ్రజ్యోతి): సోమవారం ప్రకటించిన జేఈఈ అడ్వాన్స్ ఫలితాల్లో నగరంలోని రెజోనెన్స్ కళాశాల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారని కళాశాల డైరెక్టర్లు ఆర్‌వీ నాగేంద్రకుమార్, కె. శ్రీధర్‌రావులు తెలిపారు. కళాశాలకు చెందిన టి. స్నేహమృదుల 89, బి. రాకేష్ 230, బి. అభినాయక్ 342, జె. మదన్ 371, జి. సురేష్ 557, బి. హర్షవర్ధన్ 906, బి. శ్యామ్ 1860, ఆర్. గురు ప్రసాద్ 2097, గోపిచంద్ 2275, జి. దివ్య తేజ 2847 ర్యాంకులు సాధించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ సతీష్, ఎం. భాస్కర్‌రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

న్యూఇరా ఫౌండేషన్ విజయకేతనం



విద్యార్థులను అభినందిస్తున్న యాజమాన్యం

ఖమ్మం ఖానాపురంహవేలీ, జూన్ 2(ఆంధ్రజ్యోతి): సోమవారం ప్రకటించిన జేఈఈ అడ్వాన్స్ ఫలితాలలో నగరంలోని న్యూఇరా ఫౌండేషన్ విద్యార్థుల విజయకేతనం ఎగురవేశారని కళాశాల చైర్మన్ ఐవీ రమణారావు, డైరెక్టర్ డాక్టర్ ఇ భూమేశ్వరరావులు తెలిపారు. కళాశాలకు చెందిన వి. కుషాల్ 165, దాసరి నిఖిల్ 190, ఎం నాగయశ్వంత్ 393, బానోత్ పవన్ 1135, బి. సాయి అభినవ్ 2137, ఆర్. షణ్ముఖ ప్రియ 2377, జి. రాహుల్ దేవ్ 4063 వంటి అత్యుత్తమ ర్యాంకులు సాధించారని తెలిపారు. అనంతరం విద్యార్థులను అభినందించారు.

బాలికపై యువకుడి వేధింపులు
కేసు నమోదు

అశ్వారావుపేట రూరల్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): ప్రేమపేరుతో బాలికను వేధిస్తున్న యువకుడిపై సోమవారం పోక్సో కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అశ్వారావుపేటలోని ఓ వీధికి చెందిన 16 ఏళ్ల బాలికను అదే ప్రాంతానికి చెందిన మక్కెళ్ల మారేశ్ అనే యువకుడు కొంతకాలంగా ప్రేమపేరుతో వేధిస్తున్నాడు. దీనిపై బాలిక తల్లిదండ్రులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ యయాతిరాజు వివరించారు.

పూరీ బీచ్‌లో హరీష్‌రావు సైకత శిల్పం



జిల్లాకు చెందిన వెంకటరమణ రూపొందించిన హరీష్‌రావు సైకత శిల్పం

ఖమ్మం మార్కెట్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): జూన్ 3వ తేదీన మంగళవారం రాష్ట్ర మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు జన్మదినం సందర్భంగా ఖమ్మం జిల్లాకు చెందిన ఆయన వీరాభిమాని ఉప్పల వెంకటరమణ ముదిరాజ్ వినూత్నంగా శుభాకాంక్షలు తెలిపారు. ఒడిసా రాష్ట్రంలోని పూరీ సముద్ర తీరంలో హరీష్‌రావు సైకత శిల్పాన్ని రూపొందించి ఆయనపై ప్రత్యేక అభిమానాన్ని చాటుకున్నారు.

మూలవరులకు సువర్ణ పుష్పార్చన



సుదర్శన హోమం నిర్వహిస్తున్న దృశ్యం

భద్రాచలం, జూన్ 2(ఆంధ్రజ్యోతి): భద్రాచలంలో శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో సోమవారం తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ ఉత్సవాలను పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో మూలవరులకు సువర్ణ పుష్పాలతో స్వామి వారికి అర్చన నిర్వహించారు. యాగశాలలో సుదర్శన హోమంను వైదిక సిబ్బంది నిర్వహించారు. చిత్రకూట మండపంలో తెలంగాణ అవతరణ దినోత్సవ పురస్కరించుకుని సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమాల్లో ఈవో రమాదేవి, స్థానచార్యులు కేఈ స్థలశాయి, ప్రధాన అర్చకులు అమరవాది విజయరాగవన్, ఏఈవో శ్రావణ్‌కుమార్, సాయిబాబా పాల్గొన్నారు.

నీటి తొట్టిలో పడి చిన్నారి మృతి

» రేగులచెలకలో విషాదం



రాజీవి(ఫైల్)

రఘునాథపాలెం, జూన్ 2(ఆంధ్రజ్యోతి): నీటి తొట్టిలో పడి చిన్నారి మృతి చెందిన సంఘటన రఘునాథపాలెం మండలంలో చోటు చేసుకొంది. రేగులచెలకకు చెందిన సత్తి నరేశ్, వినోదకుమారికి ఇద్దరు పిల్లలు. పెద్ద కుమార్తె రాజీవి(5) సోమవారం ఉదయం ఇంటి ముందు ఉన్న నీటి తొట్టి వద్దకు వెళ్లి ప్రమాదవశాత్తు పడిపోయింది. ఈ విషయాన్ని తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు గమనించలేదు. కొద్ది సేపటి తర్వాత ఇంట్లోని రాజీవి కనిపించకపోవటంతో తల్లిదండ్రులు ఇంటి పరిసర ప్రాంతాల్లో పరిశీలించగా నీటి తొట్టిలో చలనం లేకుండా పడిపోయి ఉంది. వెంటనే జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే పాప మృతి చెందినట్లు వైద్యులు ప్రకటించారు. ఈ సంఘటన రేగులచెలకలో విషాదాన్ని నింపింది.

మృతదేహం గుర్తింపు

దుమ్ముగూడెం జూన్ 2 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రకేసరి కాలనీ శివారులో గుంతలో పడి వ్యక్తి మృతిచెందిన సంఘటన ఆదివారం వెలుగు చూసింది. మృతుడు చర్ల మండలం లింగాపురంపాడుకు చెందిన ముక్కాల పూర్ణచంద్రరావు(32)గా కుటుంబ సభ్యులు సోమవారం గుర్తించారు. పూర్ణచంద్రరావు ఈనెల 29న ఇంటి నుంచి బయటకు వచ్చాడు. అధిక మద్యం సేవించి కల్వర్టుపై నుంచి ప్రమాదవశాత్తూ నీళ్లలో పడడంతో మృతిచెందాడు.

యువకులపై కేసు నమోదు

ఖమ్మం ఖానాపురం హవేలీ, జూన్ 2(ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తూ గొడవకు దిగిన నలుగురు యువకులపై ఖమ్మం వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. బైక్ నలుగురు యువకులు వచ్చి ఓ కారు డ్రైవర్‌పై దాడికి యత్నించారు. వెంకటగిరి క్రాస్ రోడ్డు ప్రాంతానికి చెందిన యువకులపై విచారణ జరిపి కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

జయరాజుకు రాష్ట్ర ప్రభుత్వ బహుమతి

» పలువురి అభినందనలు



కవి జయరాజును సన్మానిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి

కొత్తగూడెం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ప్రజా పోరాటానికి స్ఫూర్తిని అందించిన కవి, రచయిత, గాయకుడు, ప్రకృతితత్వవేత్త, ప్రముఖ అంబేద్కరిస్ట్, కొత్తగూడెం ప్రకృతి ఆశ్రమం వ్యవస్థాపకులు జయరాజును తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఘనంగా సత్కరించింది. కోటి రూపాయల నగదును సోమవారం అందించింది. తెలంగాణ తల్లి విగ్రహ ఆవిష్కరణ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించిన విధంగా తెలంగాణ ఉద్యమకారులకు నగదు బహుమతిని హైదరాబాద్ పరేడ్‌గ్రౌండ్‌లో జరిగిన తెలంగాణ ఆవిర్భావ వేడుకల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఘనంగా సత్కరించి నగదును అందించారు. జయరాజు భద్రాద్రి జిల్లాకు సింగరేణి కార్మిక ఉద్యమ నిర్మాతగా సూపరిచితులు. ఈ బహుమతిని అందుకున్న సందర్భాన్ని పురస్కరించుకుని జయరాజుకు జాతీయ బాలోత్సవ్ కన్వీనర్ డాక్టర్ వాసిరెడ్డి రమేషబాబు, తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ భద్రాద్రి జిల్లా అధ్యక్షులు, మోటారు వెహికిల్ ఇన్‌స్పెక్టర్ సంఘం వెంకట పుల్లయ్య, సింగరేణి ఎజీఎం గోనె శ్రీకాంత్, ప్రకృతి ఆశ్రమం నిర్వాహకులు కేహెచ్. ప్రసాద్, కోఆర్డినేటరు సుగుణారావు శుభాకాంక్షలు తెలిపిన అభినందనలు తెలిపారు.

జ్యేష్ఠ మాసోత్సవాల నివేదిక ఇదే...

11న రామాలయంలో జ్యేష్ఠాభిషేకం

భద్రాచలం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో జ్యేష్ఠమాసంలో నిర్వహించే ఉత్సవాలకు సంబంధించిన నివేదికను దేవస్థానం ఈవో రమాదేవికి వైదిక బృందం అందజేసింది. సోమవారం ఈ మేరకు ఆ వివరాలను దేవస్థానం అధికారులు పత్రికలకు విడుదల చేశారు. ఈ నెల 10, 11 తేదీల్లో జ్యేష్ఠాభిషేక మహోత్సవాలు నిర్వహించనున్నారు. 10న జ్యేష్ఠాభిషేక మహోత్సవాలకు అంకురార్పణ చేయనుండగా 11న జ్యేష్ఠాభిషేకాన్ని నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా రామయ్యకు 81 కలశాలతో ప్రత్యేక అభిషేకం నిర్వహించనున్నారు. ఈ నెల 11న జ్యేష్ఠాభిషేకాన్ని పురస్కరించుకుని నిత్య కల్యాణం నిలిపివేశారు. ఈ నెల 5నుంచి 9వరకు నమ్మాళ్వార్ తిరునక్షత్రోత్సవములు నిర్వహించనున్నారు. 7న సుదర్శన హోమం, 22న వైష్ణవ ఏకాదశిని పురస్కరించుకుని లక్ష కుంకుమార్చన నిర్వహించనున్నారు.

జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో
మెరిసిన భద్రాచలం గిరిబిడ్డలు



భూక్యా దివ్య



జర్పుల స్వాతి

భద్రాచలం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో భద్రాచలం గిరిజన గురుకుల(సీవోఈ) గిరిబిడ్డలు అద్వితీయమైన ప్రతిభ చాటి ఉన్నత ర్యాంకులు సాధించారు. భూక్యా దివ్య ఎస్టీ కేటగిరిలో 1030వ ర్యాంకు, జర్పుల స్వాతి 1852 వ ర్యాంకు సాధించారు. మరో ఐదుగురు విద్యార్థినులు కూడా ర్యాంకులు సాధించారు. గిరిజన గురుకుల ఉన్నతాధికారుల సూచనలు, భద్రాచలం ఐటీడీఏ పీవో బి.రాహుల్ నిరంతర పర్యవేక్షణ, ప్రోత్సాహం, నిష్ణాతులైన అధ్యాపకుల తర్ఫీదు వల్ల పిల్లలు ఉన్నత ర్యాంకులు సాధించటానికి దోహదపడిందని ప్రిన్సిపాల్ పద్మావతి అన్నారు.

నేటి నుంచి భూ భారతి

» 380 రెవెన్యూ గ్రామాల్లో సదస్సులు

» పెండింగ్‌లో 1,576 దరఖాస్తులు



ఖమ్మం కలెక్టరేట్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): ఇప్పటివరకు పైలట్ ప్రాజెక్టు కింద ఎంపికైన మండలాలకే పరిమితమైన రెవెన్యూ సదస్సులు నేటి నుంచి అన్ని గ్రామాల్లోనూ నిర్వహించనున్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం నుంచి 'భూ భారతి' చట్టాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయనున్న నేపథ్యంలో జిల్లాలో రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నారు. జిల్లాలో జూన్ 3 నుంచి 20 వరకు రెవెన్యూ గ్రామాల్లో సదస్సులు నిర్వహించనున్నారు. ఇందుకోసం గ్రామాల వారీ షెడ్యూల్ రూపొందించారు. ఈ పథకాన్ని పకడ్బందీగా అమలు చేసేందుకు క్షేత్రస్థాయిలో జీపీవోల భర్తీ, సర్వేయర్ల కొరత తీర్చేలా శిక్షణల నిర్వహణతో భూ భారతి చట్టం పకడ్బందీగా అమలయ్యేలా ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ప్రణాళికలను రూపొందించారు. భూ వివాదాల పరిష్కారమే లక్ష్యంగా ధరణి స్థానంలో రాష్ట్ర ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని రూపొందించింది. ఏప్రిల్ 17నుంచి 30వరకు మండలాల వారీగా అవగాహన సదస్సులు నిర్వహించారు. చట్టంపై అవగాహన కల్పించడంతోపాటు రైతుల నుంచి సలహాలు, సూచనలు స్వీకరించారు. రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, జిల్లా మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సదస్సుల్లో పాల్గొన్నారు. ఈ సదస్సుకు కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, అదనపు కలెక్టర్లు పి.శ్రీనివాసరెడ్డి, శ్రీజ, రెవెన్యూ అధికారులు పాల్గొని కొత్తచట్టం అమలు భూ భారతితో కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరించారు.

నేటి నుంచి గ్రామాలకు రెవెన్యూ అధికారులు

జిల్లాలోని 21 మండలాల పరిధిలో 380 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. ఇప్పటికే నేలకొండపల్లి మండలంలో పూర్తిగా, బోనకల్ మండలంలో పాక్షికంగా కొన్ని గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. మిగిలిన 19 మండలాల్లో ఆయా గ్రామాల్లో సదస్సులు నిర్వహించేందుకు షెడ్యూల్ ఖరారు చేశారు. నేటినుంచి రెవెన్యూ యంత్రాంగం గ్రామాలబాట పట్టనున్నారు. దాదాపు 17 రోజులపాటు అన్ని గ్రామాలను సందర్శించి రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోనున్నారు. 24 కేటగిరీల కింద అర్జీలు తీసుకోనున్నారు. తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ల ఆధ్వర్యంలో ఒక్కో రోజు రెండు, మూడు సదస్సులు నిర్వహించేలా షెడ్యూల్‌ను రూపొందించినట్టు అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి తెలిపారు.

నేటి మొలుగుమాడు సదస్సుకు డిప్యూటీ సీఎం, రెవెన్యూ మంత్రి





ఎర్రుపాలెం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): నేడు మండలంలో డిప్యూటీ సీఎం మల్లుభట్టి విక్రమార్క, రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిలు పర్యటించనున్నారు. ఎర్రుపాలెం మండలంలోని మొలుగుమాడు గ్రామాన్ని భూ సర్వే పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారు. రాష్ట్రంలో భూ భారతి అమలు చేసేందుకు రెవెన్యూశాఖ నిర్వహిస్తున్న సదస్సులను మంత్రులు అధికారికంగా ప్రారంభించనున్నారు. ఈ సదస్సులలో ప్రతి గ్రామం నుంచి రైతుల సమస్యలను నేరుగా అర్జీలరూపంలో అధికారులు తీసుకోనున్నారు.

భూ భారతిలో పెండింగ్ దరఖాస్తులు ఇలా..

ఖమ్మం, కల్లూరు రెవెన్యూ డివిజన్ల పరిధిలో సాదాబైనామా 1,726, పీవోబీలో 169, పాసుపుస్తకంలో తప్పుల సరిచేత- 1068, పెండింగ్ మ్యూటేషన్ 103, సక్సేషన్ 98, కోర్టు కేసులు 50, పట్టాదారు పాసుపుస్తకాలు 31, నాలాకు సంబంధించినవి 33, ల్యాండ్‌మ్యాటర్ గ్రీవెన్స్ 11, ఎన్నారై పాస్‌పుస్తకాలకు 2, జీపీఏ 4, ఖాతా మెర్జింగ్ 2, అర్బన్ ల్యాండ్ 5, మొత్తం 1,576 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి.

నేటి నుంచి సదస్సులు



పి.శ్రీనివాసరెడ్డి, అదనపు కలెక్టర్, ఖమ్మం

రాష్ట్రవ్యాప్తంగా భూ భారతి అమలు కానున్న నేపథ్యంలో జూన్ 3 నుంచి ప్రతి మండలంలో అన్ని గ్రామాల నుంచి దరఖాస్తులను స్వీకరించనున్నాం. వీటిని క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకోనున్నాం. ఇప్పటివరకు నేలకొండపల్లిలో 15, బోనకల్ మండలంలో 15 రెవెన్యూ గ్రామాల్లో దరఖాస్తులు స్వీకరించాం. వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించేందుకు రెవెన్యూ బృందాలు కసరత్తు చేస్తున్నాం. సాదాబైనామాలకు కూడా దరఖాస్తులు అధికంగానే వచ్చాయి. వీటిపై కూడా ప్రభుత్వ ఆదేశాల ప్రకారం పరిశీలించి చర్యలు తీసుకోనుంది. ప్రణాళికలను సిద్ధం చేసి రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నాం.

సదస్సులతో సమస్యలు తీరేనా..?

ఎర్రుపాలెం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): ధరణిలో భూ సమస్యలకు పరిష్కారం దొరక్క రైతులు రోదిస్తున్న తరుణంలో భూ భారతి చట్టం రైతుల భూసమస్యలకు పరిష్కారం చూపుతుందని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. భూ సమస్యల పరిష్కారం కోసం రైతులు ఏళ్ల తరబడి కార్యాలయాలు చుట్టూ తిరిగి విసుగెత్తిపోయారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూ భారతి చట్టానికి సంబంధించి ప్రజల నుంచి అర్జీలు రూపంలో తీసుకునేందుకు రెవెన్యూ అధికారులు సదస్సులు నిర్వహించనున్నారు. ఈ క్రమంలో భూసమస్యల పరిష్కారానికి భూభారతి ద్వారా సరళమైన మార్గాలున్నాయనే అంచనాలు ప్రజల్లో పెరిగాయి. కానీ ధరణిలో పరిష్కారం కాని సమస్యలు భూ భారతిలో పరిష్కారం అవుతాయా అని కొందరు రైతులు ఆందోళన చెందుతున్నారు. క్షేత్రస్థాయిలో ఆర్ఐ, తహసీల్దార్లు ప్రతిపాదించినా, ఆర్డీవో, కలెక్టర్ స్థాయిలో మోక్షం కలగలేదు. టీఎం 33, టీఎం15 తదితర మాడ్యుల్స్‌లో దరఖాస్తు చేసుకున్న సమస్యలు ఇప్పటికీ పరిష్కారం అవ్వలేదు. ప్రస్తుతం అధికారులు తమ శ్రద్ధను భూ భారతిపైనే పెట్టారు. ధరణిలో పెండింగ్ సమస్యలను పరిష్కరించడానికి మనసు రావడంలేదు. మండలంలోని మొలుగుమాడులో భూభారతి చట్టం రెవెన్యూ సదస్సులను జిల్లా మంత్రులు భట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డి మంగళవారం అధికారికంగా ప్రారంభించనున్నారు.

బీఆర్‌ఎస్ కంటే కాంగ్రెస్ నయం

మహాసభలో కూనంనేని సాంబశివరావు



మాట్లాడుతున్న కూనంనేని

ఏన్కూరు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్ పాలనకంటే కాంగ్రెస్ పాలన కొంత నయమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. సోమవారం తిమ్మారావుపేట గ్రామంలో 17వ మండల మహాసభ అమరనేని వీరభద్రం అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీలను కొన్ని నెరవేర్చిందని, మరికొన్నినెరవేరుస్తూ వస్తుదన్నారు. కాంగ్రెస్‌పార్టీ మంచి ఆలోచన ధోరణి కలిగి ఉండాలన్నారు తాము ఎప్పుడు బీజేపీ బీఆర్‌ఎస్ పార్టీలకు వ్యతిరేకమే తప్పా అనుకూలంకాదని తేల్చిచెప్పారు. కాంగ్రెసపార్టీని కాపాడడానికే ప్రయత్నిస్తామని కూల్చేఅలవాటు లేదన్నారు. పార్టీలోనే అంతర్గతంగా తమకు తాము ఓడించుకుంటామని అంటే చేసేదేమిలేదన్నారు కమ్యూనిస్టుల ఓట్లతో గెలిచిన ఎమ్మెల్యేలు సోదరభావంతో మెలగాలని తెలిపారు. మునుగోడు ఉప ఎన్నికల తర్వాత బీఆర్‌ఎస్ కమ్యూనిస్టులను చులకనగా చూసిందని, అదే ధోరణి కాంగ్రెస్ అవలంబిస్తే బీఆర్‌ఎస్ పార్టీకి పట్టిన గతే పడుతుందన్నారు. ఈసభలో పార్టీ జాతీయనాయకులు బాగం హేమంతరావు,రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు దొండపాటి రమేష్, నియోజకవర్గ కార్యదర్శి గ్రబాబు, దండిసురేష్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో 12 మందికి గాయాలు



ప్రమాదానికి గురైన బస్సు

తిరుమలాయపాలెం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పిండిప్రోలు సమీపంలో సోమవారం ఆర్టీసీ బస్సు ఆగివున్న లారీని ఢీకొట్టడంతో 12 మందికి గాయాలయ్యాయి. తొర్రూరు డిపోకు చెందిన బస్సు ఖమ్మం వస్తుండగా పిండిప్రోలు-దమ్మాయిగూడెం మధ్యకు రాగానే టైరు పేలడంతో ఎదురుగా ఉన్న లారీని ఢీకొట్టి పొదల్లోకి వెళ్లింది. ఈ ప్రమాదంలో బస్సులోని 12మందికి స్వల్పగాయాలు కాగా కొందరిని తిరుమలాయపాలెం ఆస్పత్రికి, మరికొందరిని ఖమ్మం ఆస్పత్రికి తరలించారు. కాగా ఈ ఘటనస్థలాన్ని పోలీసులు సందర్శించారు. వివరాలు సేకరించి కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ జగదీష్ తెలిపారు.

ఎవరో కొత్త కింగ్?

రాత్రి 7.30 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో..

ఒకటా.. రెండా గత 17 ఏళ్లుగా ఒక్కసారైనా ఐపీఎల్ టైటిల్‌ను అందుకోవాలని ఆ రెండు జట్లు ఎదురుచూస్తూనే ఉన్నాయి. ఆధునిక క్రికెట్‌లో అత్యుత్తమ ఆటగాడిగా పేరు తెచ్చుకున్న విరాట్ కోహ్లీ కెరీర్‌లోనైతే అదో పెద్ద వెలితి. రాయల్ చాలెంజర్స్ బెంగళూరును తన నాయకత్వంలో చన్నాళ్లు నడిపించినా చాంపియన్‌ను చేయలేక పోయాడు. కానీ 18వ సీజన్‌లో ఆ అద్భుతాన్ని సాధించేందుకు ఆర్‌సీబీ మరో విజయం దూరం లోనే ఉంది. ఇక గతంలో పంజాబ్ కింగ్స్‌పై ఎవరికీ ఎలాంటి అంచనాలు లేకపోయినా.. ప్రస్తుతం సీన్ మారింది. శ్రేయాస్ అయ్యర్ ఆ జట్టును కదం తొక్కిస్తున్నాడు. టేబుల్ టాపర్‌గా నిలవడమే కాకుండా తుది పోరుకు కూడా చేర్చాడు. ఇక ఈ రెండు టాప్-2 జట్ల మధ్య ఆసక్తికరపోరులో ఎవరు గెలిచినా తొలి టైటిల్‌తో పండుగ చేసుకుంటారు.



తొలి టైటిల్ వేటలో బెంగళూరు X పంజాబ్

నేడు ఐపీఎల్ -18 ఫైనల్

అహ్మదాబాద్: ప్రపంచ క్రికెట్‌లో అతి భారీ టీ20 లీగ్ అయిన ఐపీఎల్ ఆఖరి అంకానికి చేరింది. లక్షకు పైగా సీటింగ్ సామర్థ్యం కలిగిన నరేంద్ర మోదీ స్టేడియంలో నేడు (మంగళవారం) జరిగే ఫైనల్లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు- పంజాబ్ కింగ్స్ టైటిల్ కోసం తలపడనున్నాయి. షెడ్యూల్ ప్రకారం ఇప్పటికే లీగ్ ముగియాల్సి ఉన్నా.. భారత్-పాక్ యుద్ధం కారణంగా వారం పాటు వాయిదా పడిన విషయం తెలిసిందే. ఇక ఆర్‌సీబీ తుది పోరులో తలపడడం ఇది నాలుగోసారి. 2009, 2011, 2016ల్లో టైటిల్‌పై ఆశలు పెట్టుకున్నా రన్నరప్‌గానే నిలిచింది. 'ఈ సాల కప్ నమ్దే' అంటూ బెంగళూరు జట్టు అభిమానులు ప్రతీసారి హోరెత్తిస్తుంటారు. వీరి నమ్మకాన్ని నిలబెడుతూ ఈసారి అదిరే ప్రదర్శనతో జట్టు తుదిపోరుకు చేరి అంచనాలను మరింత పెంచింది. ముఖ్యంగా విరాట్ అభిమానులు నెంబర్ 18 జెర్సీలతో స్టేడియంలో సందడి చేసేందుకు సిద్ధమవుతున్నారు. అటు బెంగళూరులో హడావిడి మామూలుగా లేదు. రెస్టో బార్స్, పబ్స్‌లతో పాటు భారీ జెయింట్స్ స్క్రీన్లపై ఫైనల్‌ను తిలకించేందుకు ఫ్యాన్స్ సిద్ధమవుతున్నారు. మరోవైపు క్వాలిఫయర్1లో ఆర్‌సీబీ చేతిలోనే చిత్తుగా ఓడిన పంజాబ్ కింగ్స్ తిరిగి తుది పోరులోనూ అదే జట్టును ఢీకొనాల్సి వచ్చింది. ఆదివారం ఇదే మైదానంలో ముంబైని చిత్తు చేసిన అనుభవంతో ఈసారి బెంగళూరుకు గట్టి పంచ్ ఇవ్వాలనుకుంటోంది. 2014లో ఒక్కసారి మాత్రమే పంజాబ్ ఫైనల్లో అడుగుపెట్టింది.



ప్రతీకారంతో పంజాబ్

టేబుల్ టాపర్‌గా నిలిచిన పంజాబ్ కింగ్స్ క్వాలిఫయర్1లో ఎదురైన పరాభవంతో ఒక్కసారిగా డీలా పడింది. ఆర్‌సీబీ ధాటికి కేవలం 101 పరుగులకే పరిమితం కావడంతో షాక్‌కు గురైంది. కానీ అలాంటి స్థితి నుంచి వెంటనే తేరుకుని, ఐదు సార్లు చాంపియన్ ముంబై ఇండియన్స్‌ను క్వాలిఫయర్ 2లో మట్టి కరిపించిన విధానం అదుర్స్. కెప్టెన్ శ్రేయాస్ ఆడిన ఇన్నింగ్స్ క్రికెట్ ప్రేమికులను ఉర్రూతలూగించగా, 11 ఏళ్ల తర్వాత జట్టు ఫైనల్‌కు చేరింది. గతేడాది కేకేఆర్ కెప్టెన్‌గా ఆ జట్టుకు టైటిల్ అందించిన శ్రేయాస్‌పై.. ఇప్పుడు పంజాబ్‌ను గెలిపించే బాధ్యత ఉంది. తన రూ.26.75 కోట్ల ధరకు 603 పరుగులతో న్యాయం చేస్తున్నాడు. అతడితో పాటు బ్యాటింగ్ ఆర్డర్‌లో ఓపెనర్లు ప్రభ్‌సిమ్రన్, ప్రియాన్ష్, ఇన్‌గ్లిస్, శశాంక్ సింగ్, స్టొయినిస్ ఎదురుదాడికి సిద్ధంగా ఉన్నారు. అయితే పేసర్ జాన్సెన్ లేకపోవడంతో వీరి బౌలింగ్ కాస్త బలహీనంగా కనిపిస్తోంది. అయినప్పటికీ బ్యాటింగ్ పిచ్‌పై ముంబైని మరీ భారీ స్కోరు చేయనీయకుండా కట్టడి చేయగలిగారు. అయితే పేసర్ అర్ష్‌దీప్ మాత్రం ఎలాంటి ప్రభావమూ చూపలేదు. అలాగే గాయం తర్వాత ఆడిన స్పిన్నర్ చాహల్ సైతం ధారాళంగా పరుగు లిచ్చుకున్నాడు. ఏదేమైనా ఈ ఆఖరి పోరులో తమ లోపాలను సరి చేసుకుంటూ ఆర్‌సీబీపై ప్రతీకారం తీర్చుకోవాలన్న కసితో పంజాబ్ ఉంది.

జోరు సాగాలని..

ఆర్‌సీబీ ప్రధాన ఆకర్షణ విరాట్ కోహ్లీ అనడంలో సందేహం లేదు. ఎప్పటి మాదిరే ఈ సీజన్‌లోనూ తన స్థాయికి తగ్గ ప్రదర్శనతో రాణిస్తున్నాడు. 614 పరుగులతో టాప్-5లో కొనసాగుతున్నాడు. ఫిల్ సాల్ట్‌తో కలిసి ఓపెనర్‌గా మెరుపు ఆరంభాలతో మిడిలార్డర్‌పై ఒత్తిడి పడకుండా చూసుకుంటున్నాడు. ఇక ఈ స్టేడియంలోనూ, పంజాబ్‌పై అతడికి మెరుగైన రికార్డు ఉండడం జట్టుకు లాభించేదే. అలాగే మయాంక్ అగర్వాల్, జితేశ్ శర్మ రాణిస్తుండడం సానుకూలాంశం. అయితే కెప్టెన్ రజత్ పటీదార్ మాత్రం ఇటీవలి మ్యాచ్‌ల్లో నిరాశపర్చాడు. గత రెండు మ్యాచ్‌లకు దూరమైన ఫినిషర్ టిమ్ డేవిడ్ ఫిట్‌నెస్‌పై స్పష్టత రావాల్సి ఉంది. బౌలింగ్‌లో పేసర్ హాజెల్‌వుడ్ ఇప్పటికే 21 వికెట్లతో జట్టు విజయాల్లో పాలుపంచుకుంటున్నాడు. ఇతర పేసర్లు యష్ దయాల్, తుషార, భువనేశ్వర్ సైతం ప్రభావం చూపుతున్నారు. అందుకే అన్ని విభాగాల్లోనూ పటిష్టంగా కనిపిస్తున్న ఆర్‌సీబీ స్థాయికి తగ్గ ప్రదర్శన కనబరిస్తే చాంపియన్ కావడం సాధ్యమే..

తుది జట్లు (అంచనా)

బెంగళూరు: సాల్ట్, విరాట్, మయాంక్, రజత్ పటీదార్ (కెప్టెన్), లివింగ్‌స్టోన్, జితేశ్ శర్మ, షెఫర్డ్, క్రునాల్, భువనేశ్వర్, యష్ దయాల్, హాజెల్‌వుడ్.

పంజాబ్: ప్రభ్‌సిమ్రన్, ప్రియాన్ష్, ఇన్‌గ్లిస్, శ్రేయాస్ (కెప్టెన్), నేహల్, శశాంక్, స్టొయినిస్, ఒమర్జాయ్, జేమిసన్, అర్ష్‌దీప్, చాహల్.

పిచ్

అహ్మదాబాద్ పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉంటుంది. క్వాలిఫయర్2లో ఇరు జట్లూ 200+ స్కోర్లు సాధించాయి. ఇక్కడ మొదట బ్యాటింగ్‌కు దిగిన జట్లకే విజయావకాశాలు ఎక్కువగా ఉన్నా.. చివరి మ్యాచ్‌లో పంజాబ్ అద్భుతంగా ఛేదించింది. దీంతో ఫైనల్లో టాస్ గెలిచిన జట్టు ఫీల్డింగ్‌కు మొగ్గు చూపవచ్చు.

వర్షం పడి రద్దయితే..?

ఫైనల్‌కు కూడా వర్షంతో ముప్పు పొంచి ఉంది. మంగళవారం రోజంతా ఆకాశం మేఘావృతంగా ఉండనుందట. అహ్మదాబాద్, సమీప ప్రాంతాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలకు ఆస్కారముందని వాతావరణ శాఖ తెలిపింది. ఒకవేళ వర్షంతో మ్యాచ్ రద్దయినా ఎలాంటి ఇబ్బందీ లేదు. ఫైనల్‌కు రిజర్వ్ డే ఉన్నందున బుధవారం జరుగుతుంది. అప్పుడు కూడా వర్షంతో వీలు కాకపోతే లీగ్ దశలో టేబుల్ టాపర్ (పంజాబ్) జట్టును విజేతగా ప్రకటిస్తారు.

తటస్థ వేదికగా కొలంబో

ఐసీసీ మహిళల వన్డే వరల్డ్‌కప్

దుబాయ్: హైబ్రిడ్ ఫార్మాట్‌లో జరిగే మహిళల వన్డే వరల్డ్‌కప్ వేదికలను ఐసీసీ ఆదివారం ప్రకటించింది. టోర్నీకి భారత్ ఆతిథ్యం ఇస్తుండగా.. తటస్థ వేదికగా శ్రీలంకలోని కొలంబోను ఎంపిక చేశారు. చాంపియన్స్ ట్రోఫీ సందర్భంగా కుదిరిన ఒప్పందం ప్రకారం భారత్ నిర్వహించే ఐసీసీ ఈవెంట్లలో కూడా తమ మ్యాచ్‌లను తటస్థ వేదికపైనే ఆడే విధంగా పాక్ షరతు విధించింది. సెప్టెంబరు 30 నుంచి నవంబరు 2వ తేదీ వరకు జరిగే వరల్డ్‌కప్ కోసం బెంగళూరు, గువాహటి, ఇండోర్, విశాఖపట్నంతోపాటు కొలంబోను వేదికలుగా ఐసీసీ ఎంపిక చేసింది. సెప్టెంబరు 30న ఆరంభ మ్యాచ్‌లో భారత్ ఆడనుంది. అయితే, ప్రత్యర్థి ఎవరనేది ఇంకా ఖరారు కాలేదు. అక్టోబరు 29న తొలి సెమీస్‌కు గువాహటి లేదా కొలంబో, 30న జరిగే రెండో సెమీస్ బెంగళూరు వేదిక నిర్ణయించారు. నవంబరు 2న జరిగే ఫైనల్ ఫైట్‌కు బెంగళూరు లేదా కొలంబోలో నిర్వహించనున్నారు. భారత్‌తోపాటు డిఫెండింగ్ చాంప్ ఆస్ట్రేలియా, బంగ్లాదేశ్, పాకిస్థాన్, ఇంగ్లండ్, న్యూజిలాండ్, సౌతాఫ్రికా, పాకిస్థాన్, బంగ్లాదేశ్ జట్లు ఆడనున్నాయి.

ఎమర్జింగ్ టీమ్స్ ఆసియా కప్ వాయిదా..

మహిళల ఎమర్జింగ్ టీమ్స్ ఆసియా కప్‌ను వాయిదా వేసినట్టు ఆసియా క్రికెట్ మండలి (ఏసీసీ) తెలిపింది. వాస్తవంగా ఈ నెల 6 నుంచి శ్రీలంకలో టోర్నీ జరగాల్సి ఉంది. అయితే, వాతావరణంలో తీవ్ర మార్పులతోపాటు లంక ప్రజల ఆరోగ్యంపై ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో లంక బోర్డు రాసిన లేఖ ఆధారంగా టోర్నీని వాయిదా వేస్తూ ఏసీసీ నిర్ణయం తీసుకొంది. త్వరలోనే కొత్త షెడ్యూల్‌ను ప్రకటిస్తారని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. కాగా, ఇండో-పాక్ మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో సెప్టెంబరులో జరగాల్సిన పురుషుల ఆసియా కప్ టీ20 టోర్నీ కూడా రద్దయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని సమాచారం.

శ్రేయాస్, హార్దిక్‌కు భారీ జరిమానా

అహ్మదాబాద్: క్వాలిఫయర్-2లో భాగంగా జరిగిన మ్యాచ్‌లో పంజాబ్-ముంబై కెప్టెన్లపై భారీ జరిమానా విధించారు. ఈ సీజన్‌లో రెండోసారి స్లో ఓవర్ రేట్‌కు పాల్పడినందుకు కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్‌పై రూ.24 లక్షల జరిమానా విధించగా.. మిగిలిన పంజాబ్ ఆటగాళ్ల మ్యాచ్ ఫీజులో రూ.6 లక్షల కోత విధించారు. ఇక ముంబై జట్టు మూడోసారి స్లోఓవర్ రేట్‌కు పాల్పడడంతో కెప్టెన్ హార్దిక్‌పై ఏకంగా రూ.30 లక్షలు, ఆటగాళ్లపై రూ.12 లక్షల జరిమానా పడింది.

ప్రతీకారం తీర్చుకున్నాడు..

కార్ల్‌సన్‌కు గుకేష్ షాక్

'క్లాసికల్'లో నార్వే దిగ్గజంపై భారత జీఎంకు తొలి విజయం

స్టావంజర్ (నార్వే): ప్రపంచ చాంపియన్ గుకేష్..వరల్డ్ నెం.1 మాగ్నస్ కార్ల్‌సన్‌పై ప్రతీకారం తీర్చుకున్నాడు. నార్వే చెస్ టోర్నీ ఆరో రౌండ్‌లో కార్ల్‌సన్‌కు షాకిచ్చాడు. తద్వారా క్లాసికల్ గేమ్‌లో..సమకాలీన చెస్ దిగ్గజం కార్ల్‌సన్‌పై గుకేష్ తొలిసారి విజయం సాధించాడు. గుకేష్ చేతిలో ఓడిపోయాననే అసహనంతో బోర్డుపై కార్ల్‌సన్ ప్రతాపం చూపాడు. ఆదివారం రాత్రి జరిగిన ఆరో గేమ్‌లో తెల్లపావులతో తలపడిన 19 ఏళ్ల గుకేష్ 62 సుదీర్ఘ ఎత్తుల అనంతరం కార్ల్‌సన్‌కు చెక్ పెట్టాడు. నల్లపావులతో ఆడినా మ్యాచ్‌లో సింహభాగం కార్ల్‌సనే ఆధిక్యం ప్రదర్శించాడు. అయితే సరైన ఎత్తులతో ప్రత్యర్థిని ఎదుర్కొన్న గుకేష్ గేమ్ సుదీర్ఘంగా కొనసాగేలా చేశాడు. ఈక్రమంలో కార్ల్‌సన్ చేసిన తప్పిదాన్ని సద్వినియోగం చేసుకున్న భారత జీఎం ప్రత్యర్థిపై సంచలన విజయం అందుకున్నాడు. టోర్నమెంట్ తొలి రౌండ్‌లో మాగ్నస్ చేతిలో చవిచూసిన ఓటమికి గుకేష్ బదులు తీర్చుకున్నాడు. ఆరో రౌండ్ గెలుపుతో మొత్తం 8.5 పాయింట్లతో గుకేష్ మూడో స్థానానికి దూసుకొచ్చాడు. తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ అర్జున్ ఇరిగేసి ఆర్మగడాన్ టైబ్రేకర్‌లో చైనా జీఎం వీ ఈపై నెగ్గాడు. దాంతో మొత్తం 7.5 పాయింట్లతో హికారు నకమురాతో కలిసి అర్జున్ నాలుగో స్థానంలో నిలిచాడు. మహిళల విభాగంలో గ్రాండ్‌మాస్టర్ వైశాలీ చేతిలో టైబ్రేకర్‌లో కోనేరు హంపి పరాజయం చవిచూసింది. అయితే మొత్తం 9.5 పాయింట్లతో ముజిచుక్‌తో కలిసి హంపి అగ్ర స్థానంలోనే కొనసాగుతోంది.



తప్పు చేసి.. సారీ చెప్పి..

గుకేష్ చేతిలో ఓటమితో కార్ల్‌సన్ తీవ్ర ఆగ్రహానికి లోనయ్యాడు. ఈక్రమంలో అతడు టేబుల్‌పై బలంగా బాదాడు. దాంతో బోర్డుపై ఉన్న పావులు చెల్లాచెదురయ్యాయి. ఆపై గుకేష్‌కు షేక్‌హ్యాండ్ ఇచ్చి సారీ చెప్పిన కార్ల్‌సన్ సీటులోంచి లేచాడు. తప్పు తెలుసుకొని తిరిగి వచ్చి టేబుల్‌పై చెల్లాచెదురైన పావులను సర్దాడు. మరోవైపు కార్ల్‌సన్‌పై విజయాన్ని జీర్ణించుకొనేందుకు గుకేష్‌కు కొంత సమయం పట్టింది. ఈక్రమంలో కార్ల్‌సన్ రూమ్ నుంచి వెళుతూ గుకేష్‌కు మరోసారి సారీ చెప్పి వెన్ను తట్టడం అందర్నీ ఆకర్షించింది.

ప్రధాని అభినందన

గుకేష్‌ను ప్రధాని మోదీ ప్రశంసించారు. 'చెస్‌లో అత్యుత్తమ ఆటగాడిపై విజయం సాధించినందుకు అభినందన. నార్వే చెస్ ఆరో రౌండ్‌లో కార్ల్‌సన్‌పై గెలుపొందడం గుకేష్ అద్భుత నైపుణ్యాలకు అతడి అంకితభావానికి అద్దం పడుతుంది' అని ప్రధాని ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

మెరుపు వీరుడి వీడ్కోలు

వన్డేలకు మ్యాక్స్‌వెల్ గుడ్ బై

టీ20లలో కొనసాగుతానని ప్రకటన



మెల్‌బోర్న్: ఆస్ట్రేలియా ఆల్‌రౌండర్ గ్లెన్ మ్యాక్స్‌వెల్ వన్డేలకు రిటైర్మెంట్ ప్రకటించాడు. వచ్చే ఏడాది శ్రీలంకలో జరిగే టీ20 వరల్డ్ కప్‌పై దృష్టి సారించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్టు సోమవారం వెల్లడించాడు. వన్డేలు ఆడేందుకు తన శరీరం సహకరించడంలేదని, అయినా ఈ ఫార్మాట్‌లో తాను కొనసాగితే స్వార్థపరుడినే అవుతానని చెప్పుకొచ్చాడు. మెరుపు బ్యాటింగ్‌కు మారుపేరైన 36 ఏళ్ల మ్యాక్స్‌వెల్ ఆస్ట్రేలియాకు 149 వన్డేలలో ప్రాతినిధ్యం వహించాడు. ఇక..భారత్ ఆతిథ్యమిచ్చిన 2023 వన్డే ప్రపంచ కప్‌లో అఫ్ఘానిస్థాన్‌పై వాంఖడే స్టేడియంలో మ్యాక్సీ ఆడిన ఇన్నింగ్స్ 50 ఓవర్ల ఫార్మాట్‌లో గొప్ప వాటిలో ఒకటిగా నిలుస్తుంది. 292 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో ఆసీస్ జట్టు 91/7 స్కోరుతో ఓటమి అంచున నిలిచింది. అలాంటి పరిస్థితులలో అత్యంత ఒత్తిడిని అధిగమిస్తూ, అదిరే ఎండలో ఒంట్లోని శక్తంతా హరించుకుపోయి బ్యాటింగ్ చేయడమే కష్టమైన దశలో కేవలం 128 బంతుల్లో ఎడాపెడా ఫోర్లు, సిక్సర్లు దంచుతూ 201 పరుగులు చేసి జట్టును విజయపథాన నిలిపాడు. ఈ ఇన్నింగ్స్‌ను వన్డే చరిత్రలో నభూతోగా పండితులు అభివర్ణించారు. ఆ విజయం ఇచ్చిన స్ఫూర్తితో ఆపై ఆస్ట్రేలియా జట్టు వన్డే వరల్డ్ కప్ విజేతగా నిలిచింది. వన్డేలలో మ్యాక్స్‌వెల్ 126 సగటు వెస్టిండీస్ బ్యాటర్ ఆండ్రీ రస్సెల్ తర్వాత రెండో అత్యధికం కావడం విశేషం.

మ్యాక్స్‌వెల్ వన్డే కెరీర్ ఇలా..: మ్యాచ్‌లు-149; పరుగులు-3990; అత్యధిక స్కోరు-201 నాటౌట్; సెంచరీలు-4; హాఫ్ సెంచరీలు-23

అంతర్జాతీయ క్రికెట్‌కు క్లాసెన్ గుడ్‌బై



కేప్‌టౌన్: దక్షిణాఫ్రికా వికెట్ కీపర్-బ్యాటర్ హెన్రిచ్ క్లాసెన్ (33) అంతర్జాతీయ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించాడు. గతేడాది జనవరిలోనే టెస్టులకు గుడ్‌బై చెప్పిన క్లాసెన్.. వైట్‌బాల్ ఫార్మాట్ నుంచి తక్షణమే వైదొలుగుతున్నట్టు తెలిపాడు. ఫ్రాంచైజీ క్రికెట్ వ్యవహారాలను సమన్వయం చేసుకొనేందుకే ఈ నిర్ణయం తీసుకొన్నట్టు చెప్పాడు. ఏడేళ్ల కెరీర్‌లో దక్షిణాఫ్రికా తరపున 4 టెస్టులు, 60 వన్డేలు, 58 టీ20లు ఆడాడు. ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ తరఫున ఆడిన క్లాసెన్.. వచ్చే నెలలో అమెరికాలో జరిగే మేజర్ లీగ్ క్రికెట్ ఆడనున్నాడు. 'నా కెరీర్, కుటుంబ భవిష్యత్ కోసం ఎంతో ఆలోచించి నిర్ణయం తీసుకొన్నా. కఠిన నిర్ణయమే అయినా.. ప్రశాంతంగా ఉంద'ని క్లాసెన్ తెలిపాడు. ఏప్రిల్‌లో ప్రకటించిన సెంట్రల్ కాంట్రాక్ట్ జాబితాలో క్లాసెన్ పేరు లేకపోవడంతోనే అతడు రిటైర్మెంట్‌పై ఊహాగానాలు చెలరేగాయి. 2018 ఫిబ్రవరిలో స్వదేశంలో భారత్‌తో సిరీస్‌లో వన్డే, టీ20లు అరంగేట్రం చేసిన క్లాసెన్.. పరిమిత ఓవర్ల క్రికెట్‌లో పవర్ హిట్టర్‌గా ఎదిగాడు.



బోయిస్సన్

పెగులకు ఝలక్

● క్వార్టర్స్‌కు గాఫ్, జొకో, జ్వెరెవ్ ● ఫ్రెంచ్ ఓపెన్

పారిస్: ఫ్రెంచ్ ఓపెన్‌లో అన్‌సీడెడ్ లోయిస్ బోయిస్సన్ సంచలనం సృష్టించింది. మూడో సీడ్ జెస్సికా పెగులను ఓడించిన బోయిస్సన్ క్వార్టర్స్‌కు దూసుకెళ్లింది. రెండో సీడ్ కొకో గాఫ్, నొవాక్ జొకోవిచ్, మూడో సీడ్ అలెగ్జాండర్ జ్వెరెవ్, మిర్రా ఆండ్రీవ కూడా రౌండ్-8లోకి అడుగుపెట్టాడు. సోమవారం జరిగిన ప్రీక్వార్టర్స్‌లో 21 ఏళ్ల లోయిస్ బోయిస్సన్ (ఫ్రాన్స్) 3-6, 6-4, 6-4తో పెగుల (అమెరికా)కు షాకిచ్చింది. రెండో సీడ్ గాఫ్ 6-0, 7-5తో అలెగ్జాండ్రోవాపై, ఆండ్రీవ 6-3, 7-5తో డారియా కసట్‌కినా (ఆస్ట్రేలియా)పై, ఏడో సీడ్ మాడిసన్ కీస్ 6-3, 7-5తో హేలీ బాప్టిస్ట్‌పై గెలిచి ముందంజ వేశారు. పురుషుల సింగిల్స్‌లో ఆరో సీడ్ జొకోవిచ్ (సెర్బియా) 6-2, 6-3, 6-2తో కామెరూన్ నోరి (బ్రిటన్)పై వరుసగా సెట్లలో నెగ్గాడు. కాగా, జ్వెరెవ్‌కు వాకోవర్ లభించింది. టాలన్ గ్రీక్‌స్పూర్‌తో పోరులో 6-4, 3-0తో జ్వెరెవ్ (జర్మనీ) ఆధిక్యంలో ఉన్నప్పుడు.. ప్రత్యర్థి గాయంతో తప్పుకొన్నాడు.

కేసుల సత్వర పరిష్కారంతోనే న్యాయ వ్యవస్థపై విశ్వాసం

» హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్‌పాల్

» వర్చువల్ విధానంలో నిడమనూరు కోర్టు భవనం ప్రారంభం

నిడమనూరు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): కేసుల సత్వర పరిష్కారంతోనే న్యాయ వ్యవస్థపై విశ్వాసం ఏర్పడుతుందని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి(సీజే) జస్టిస్ సుజోయ్‌పాల్ అన్నారు. ఇందుకు న్యాయాధికారులు, న్యాయవాదులు దోహదం చేయాలని కోరారు. నల్లగొండ జిల్లా నిడమనూరులో రూ.5.50కోట్ల నిధులతో నిర్మించిన జూనియర్ సివిల్ జడ్జి కోర్టు భవన సముదాయాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ రాధారాణి, జస్టిస్ సుధ, జస్టిస్ సుజన, జస్టిస్ వినోద్‌కుమార్‌ల పాల్గొన్నారు. ఈ సందర్భంగా జస్టిస్ సుజోయ్‌పాల్ మాట్లాడుతూ కేసులను పెండింగ్‌లో ఉంచకుండా సత్వరమే పరిష్కరించి కక్షిదారులకు న్యాయం చేసినప్పుడే న్యాయ వ్యవస్థపై ప్రజల్లో మరింత నమ్మకం ఏర్పడుతుందన్నారు. జనాభా పెరుగుతుండటంతో కేసులు కూడా పెరుగుతున్నాయని, దానికి అనుగుణంగా కోర్టుల ఏర్పాటు కూడా పెరగాల్సి ఉందని అభిప్రాయపడ్డారు. ఎక్కువ వాయిదాలు తీసుకోకుండా కేసులను త్వరితగతిన ముగించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. కక్షిదారులకు అందుబాటులో ఉంటూ సత్వర న్యాయం అందించాల్సిన బాధ్యత న్యాయవాదులపై ఉందన్నారు. హైకోర్టు ఫోర్టు పోలియో న్యాయమూర్తి వినోద్‌కుమార్ మాట్లాడుతూ నిడమనూరు కోర్టు పరిధిలో కేసులు ఎక్కువగా ఉన్నందున అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. నల్లగొండ జిల్లా ప్రధాన న్యాయాధికారి నాగరాజు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో అదనపు జిల్లా జడ్జీలు సంపూర్ణ ఆనంద్, వేణు, నిడమనూరు కోర్టు ఇన్‌చార్జి న్యాయాధికారి పవన్‌కుమార్, అదనపు ఎస్పీ రమేష్, అదనపు కలెక్టర్ నారాయణ్‌అమిత్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఉన్నం చినవీరయ్య పాల్గొన్నారు..

తెలంగాణ ఉజ్వల ప్రయాణంలో ఎన్నారైలది కీలకపాత్ర

ఎన్నారై అంటే.. 'నెసెసరీ రెసిడెంట్ ఆఫ్ ఇండియా'

» పొజిషన్‌లో ఉన్నా, అపోజిషన్‌లో ఉన్నా మాకు తెలంగాణే ఫస్ట్

» ఓట్లలో వెనకబడ్డామేమో కానీ, తెలంగాణను ప్రేమించడంలో కాదు

» డల్లాస్‌లో తెలంగాణ ఆవిర్భావ, బీఆర్‌ఎస్ రజతోత్సవ సంబరాల్లో

» బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యలు



హైదరాబాద్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంతో పాటు రాష్ట్ర అభివృద్ధిలో ప్రవాసీయుల పాత్ర ఎనలేదని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. తెలంగాణ ఉద్యమంలో, పదేళ్ల ఉజ్వల ప్రయాణంలో ఎన్నారైల పాత్ర అద్వితీయమని కొనియాడారు. 'ఎన్నారై అంటే నాన్ రెసిడెంట్ ఇండియన్ కాదు.. నెసెసరీ రెసిడెంట్ ఆఫ్ ఇండియా' అని చెప్పారు. తెలంగాణ చరిత్రలో ఎన్నారైల పాత్ర ఎప్పటికీ సువర్ణాక్షరాలతో లిఖించి ఉంటుందన్నారు. అమెరికాలో నివసిస్తున్న ఆడబిడ్డలు ఏనాడూ బతుకమ్మను మర్చిపోలేదని, బతుకునిచ్చిన తెలంగాణ తల్లిని కూడా మర్చిపోలేదని అభినందించారు. అమెరికాలోని డల్లాస్‌లో నిర్వహించిన తెలంగాణ రాష్ట్రావతరణ వేడుకలు, బీఆర్‌ఎస్ రజతోత్సవ సంబరాల్లో కేటీఆర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. 'జననీ జన్మభూమిశ్చ.. స్వర్గాదపీ గరీయసీ' అంటూ తన ప్రసంగాన్ని మొదలుపెట్టిన కేటీఆర్.. కర్మభూమి మీద కార్యదక్షులై వర్ధిల్లాలని, అదే సమయంలో జన్మభూమి రుణం కూడా తీర్చుకోవాలని ఎన్నారైలకు పిలుపునిచ్చారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టాలని కోరారు. 14 ఏళ్ల అలుపెరగని పోరాటంతో సాధించిన తెలంగాణ రాష్ట్రం, కేసీఆర్ పాలనలో కేవలం పదేళ్లలోనే దేశంలో అగ్రగామి రాష్ట్రంగా ఎదిగిందని గుర్తుచేశారు. స్వతంత్ర భారతదేశ చరిత్రలో అత్యంత విజయవంతమైన స్టార్టప్ రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందన్నారు. తెలంగాణను అద్భుత అవకాశాల అక్షయపాత్రగా, దేశానికే ఆర్థిక చోదక శక్తిగా తీర్చిదిద్దిన ఘనత ముమ్మాటికీ కేసీఆర్‌దేనని చెప్పారు. ట్రంప్ విధానాలతో ఇబ్బందులు పడుతున్న తెలుగు విద్యార్థులకు బీఆర్‌ఎస్ అండగా ఉంటుందన్నారు. అమెరికాలో లీగల్ సెల్ ఏర్పాటు విద్యార్థులను ఆదుకుంటామని కేటీఆర్ హామీ ఇచ్చారు. పదేళ్లపాటు అధికారంలో ఉన్నప్పుడు బరువులా కాకుండా బాధ్యతగా, ఉద్యమ స్ఫూర్తితో ప్రభుత్వాన్ని నడిపామని చెప్పారు. 2023లో జరిగిన ఎన్నికల్లో ఓట్ల పరంగా వెనకపడి ఉండొచ్చు కానీ, తెలంగాణను ప్రేమించడంలో ఎన్నటికీ వెనకబడమని తెలిపారు. 'పొజిషన్‌లో ఉన్నా, అపోజిషన్‌లో ఉన్నా కచ్చితంగా మాకు తెలంగాణ ఫస్ట్, ఇండియానే ఫస్ట్' అని కేటీఆర్ స్పష్టం చేశారు. గతంలో తెలంగాణ బిడ్డలు బతుకుతెరువు కోసం వలస వెళ్లేవారని.. ఇప్పుడు ఇతర రాష్ట్రాల కూలీలు వచ్చి తెలంగాణ పొలాల్లో పనిచేస్తున్నారని చెప్పారు. ప్రపంచమే ఆశ్చర్యపోయేలా టీఎస్‌ఐపాస్ విధానాన్ని రూపొందించామని, దాంతో 27 వేలకు పైగా పరిశ్రమలకు అనుమతులు ఇచ్చామని వివరించారు. దేశంలోనే జిల్లాకో మెడికల్, నర్సింగ్ కళాశాల ఉన్న ఒకే ఒక్క రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దినట్లు కేటీఆర్ వెల్లడించారు.

మెడికల్ వీసాపై వచ్చి డ్రగ్స్ దందా

» నైజీరియా నుంచి నేరుగా గోవాకు

» 12 ఏళ్లుగా పేర్లు మార్చి రాకపోకలు

» నైజీరియన్‌ను అరెస్టు చేసిన టీజీ న్యాబ్

» రూ.1.25 కోట్ల మత్తుపదార్థాల స్వాధీనం

హైదరాబాద్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): పన్నెండేళ్లుగా వేర్వేరు పేర్లతో మెడికల్ వీసాపై నైజీరియా నుంచి నేరుగా గోవాలో దిగి.. డ్రగ్స్ దందా చేస్తున్న ఘరానా పెడ్లర్‌ను తెలంగాణ నార్కోటిక్స్ బ్యూరో(టీజీ న్యాబ్) అరెస్టు చేసింది. నైజీరియాకు చెందిన ఇమాన్యుయేల్ బెడియాకో అలియాస్ మాక్స్‌వెల్ అలియాస్ మాక్స్ అనే వ్యక్తి.. రూ.కోట్లలో డ్రగ్స్ దందా చేసి, రూ.60 లక్షల వరకు కమీషన్ పొందినట్లు అధికారులు గుర్తించారు. ఈ కేసు వివరాలను టీజీ న్యాబ్ డీజీ సందీప్ శాండిల్య వెల్లడించారు. మ్యాక్స్ తొలుత 2013లో బెంగళూరులో చికిత్స పేరుతో భారత్‌కు వచ్చాడు. అక్కడి నుంచి గోవాకు వెళ్లి, మరో నైజీరియన్ రోమీతో కలిసి డ్రగ్స్ దందా మొదలుపెట్టాడు. ఇలా.. 2022 వరకు గోవా, హైదరాబాద్‌తోపాటు.. దేశంలోని పలు ప్రాంతాల్లో డ్రగ్స్ దందా చేశాడు. ఆ తర్వాత మళ్లీ నైజీరియాకు వెళ్లి.. 2023 తర్వాత రెండుసార్లు మారు పేర్లతో మెడికల్ వీసాపై వచ్చాడు. గోవాలోని రోమీతో కలిసి డ్రగ్స్ దందాను కొనసాగించాడు. హైదరాబాద్‌లో ఇతని కదలికలపై ఉప్పందుకున్న టీజీ న్యాబ్ పోలీసులు.. పక్కా వ్యూహంతో అరెస్టు చేశారు. ఇతని నుంచి రూ.1.25 కోట్లు విలువ చేసే 550 గ్రాముల కొకైన్, 11 వందల ఎక్స్‌టసీ పిల్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఇతనిపై రెడ్‌కార్నర్ నోటీసును జారీ చేసి, నైజీరియాకు డీపోర్ట్ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు సందీప్ శాండిల్య వివరించారు.

ప్రపంచంలో అత్యంత విలువైన టెక్ దిగ్గజాల్లో రిలయన్స్

రూ.18.45 లక్షల కోట్ల మార్కెట్ విలువతో 23వ స్థానంలో అంబానీ కంపెనీ

న్యూఢిల్లీ: భారత కుబేరుడు ముకేశ్ అంబానీకి చెందిన రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు మరో గౌరవం దక్కింది. ప్రపంచంలోని 30 అత్యంత విలువైన లిస్టెడ్ టెక్ దిగ్గజ కంపెనీల జాబితాలో రిలయన్స్‌కూ చోటు లభించింది. ఈ లిస్ట్‌లో స్థానం దక్కించుకున్న ఏకైక భారత కంపెనీ ఇదే. 'ట్రెండ్స్-ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్' పేరుతో సోమవారం విడుదలైన రిపోర్టు ప్రకారం.. 21,600 కోట్ల డాలర్ల (రూ.18.45 లక్షల కోట్లు) మార్కెట్ విలువతో రిలయన్స్ 23వ స్థానంలో నిలిచింది. కాగా, అమెరికాకు చెందిన మైక్రోసాఫ్ట్, ఎన్‌విడియా, యాపిల్, అమెజాన్, ఆల్ఫాబెట్, మెటా ప్లాట్‌ఫామ్స్, టెస్లా, బ్రాడ్‌కామ్ వరుసగా తొలి 8 స్థానాలను కైవసం చేసుకున్నాయి. తైవాన్‌కు చెందిన టీఎస్ఎంసీ 9వ స్థానంలో ఉంది. చైనా కంపెనీ టెన్సెంట్ 10వ స్థానంలో ఉంది.

ఇనుప ఖనిజం ఉత్పత్తిలో 22 శాతం వృద్ధి లక్ష్యం: ఎన్ఎండీసీ

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగంలోని ఎన్ఎండీసీ ఈ ఏడాది ఇనుప ఖనిజం ఉత్పత్తిని 22% మేరకు పెంచి 5.5 కోట్ల టన్నులకు చేర్చాలని లక్ష్యంగా పెట్టుకుంది. 2030 నాటికి 10 కోట్ల టన్నులకు ఉత్పత్తిని విస్తరించాలన్న బృహత్ ప్రణాళికలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్టు ఎన్ఎండీసీ సీఎండీ అమితవ ముఖర్జీ తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో 4.5 కోట్ల టన్నుల ఉత్పత్తి సామర్థ్యాన్ని సాధించింది. ఏప్రిల్, మే నెలల్లో 45% వృద్ధితో 84.3 లక్షల టన్నుల ఇనుప ఖనిజం ఉత్పత్తి చేసినట్టు తెలిపింది.

వైమానిక రంగంలో అద్భుత అవకాశాలు



విదేశీ సంస్థలు పెట్టుబడులతో రావాలి
విమానాల తయారీ కేంద్రంగా భారత్
ఐఏటీఏ సదస్సులో ప్రధాని నరేంద్ర మోదీ

న్యూఢిల్లీ: శరవేగంగా అభివృద్ధి చెందుతున్న భారత వైమానిక రంగం పెట్టుబడులకు అద్భుత అవకాశాల గని అని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు విదేశీ కంపెనీలు ముందుకు రావాలని కోరారు. ఢిల్లీలో జరుగుతున్న ఇంటర్నేషనల్ ఎయిర్ ట్రాన్స్‌పోర్ట్ అసోసియేషన్ (ఐఏటీఏ) వార్షిక సమావేశాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ ఆయన ఈ విజ్ఞప్తి చేశారు. 2030 నాటికి భారత విమానాల నిర్వహణ, మరమ్మతులు, కార్యకలాపాల (ఎంఆర్‌ఓ) రంగం 400 కోట్ల డాలర్ల స్థాయికి చేరనుందన్నారు. భారత్‌ను విమానాల తయారీ కేంద్రంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన అన్ని చర్యలను ప్రభుత్వం తీసుకుంటుందన్నారు. ఈ విషయాలను దృష్టిలో ఉంచుకుని భారత్‌ను ఒక మార్కెట్‌గా కాకుండా.. వాల్యూ చెయిన్ లీడర్‌గా చూడాలని కోరారు. దేశీయ విమానయానపరంగా చూస్తే ప్రస్తుతం భారత్ ప్రపంచంలో మూడో అతిపెద్ద మార్కెట్‌గా ఎదిగిన విషయాన్ని ప్రధాని గుర్తు చేశారు. దేశంలోని మారుమూల ప్రాంతాలకు విమానయానాన్ని దగ్గర చేసేందుకు తమ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఉడాన్ పథకం భారత విమానయాన చరిత్రలో ఒక సువర్ణ అధ్యాయమన్నారు.

మరో 50 ఎయిర్‌పోర్టులు

వచ్చే ఐదేళ్లలో దేశంలో కొత్తగా మరో 50 విమానాశ్రయాలు ఏర్పాటు చేయనున్నట్టు ఇదే సదస్సులో పాల్గొన్న కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు ప్రకటించారు. 2014లో దేశంలో 74 విమానాశ్రయాలు ఉంటే, ప్రస్తుతం ఆ సంఖ్య 164కు చేరిందన్నారు. ఉడాన్ పథకంతో దేశంలో విమానయానం ప్రజాస్వామ్యీకరించబడి 619 మార్గాలు అందుబాటులోకి వచ్చాయన్నారు. విమానాల నిర్వహణ మరమ్మత్తులకూ భారత్‌ను కేంద్రంగా తీర్చిదిద్దేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్టు కేంద్ర మంత్రి ప్రకటించారు.

విమాన సంస్థల లాభాలు రూ.3 లక్షల కోట్లు

కొన్ని సమస్యలు, సవాళ్లు ఉన్నా ఈ సంవత్సరం అంతర్జాతీయ విమానయాన సంస్థలు 97,900 కోట్ల డాలర్ల (సుమారు రూ.83.59 లక్షల కోట్లు) ఆదాయంపై 3,600 కోట్ల డాలర్ల (సుమారు రూ.3.07 లక్షల కోట్లు) లాభాలు ఆర్జించే అవకాశం ఉందని ఐఏటీఏ అంచనా. గత ఏడాదితో పోలిస్తే ఇది 360 కోట్ల డాలర్లు ఎక్కువని ఐఏటీఏ డైరెక్టర్ జనరల్ విల్లీ వాల్ష్ ప్రకటించారు. ప్రస్తుతం విమానయాన రంగం ప్రపంచ జీడీపీలో 3.9 శాతం వాటా కలిగి ఉందన్నారు. భారత విమానయాన రంగం జీడీపీకి 560 కోట్ల డాలర్లు (సుమారు రూ.47,818 కోట్లు) సమకూరుస్తూ నేరుగా 3,69,700 మందికి ప్రత్యక్షంగా ఉపాధి కల్పిస్తోందన్నారు. ఖర్చులు, పన్నుల భారం పెరుగుతున్నా పదేళ్ల క్రితంతో పోలిస్తే విమానయాన సంస్థల వాస్తవ ఖర్చులు 40 శాతం వరకు తగ్గాయని ఐఏటీఏ డైరెక్టర్ జనరల్ అన్నారు. పరోక్షంగా విమానయాన రంగంతో ముడిపడి ఉన్న పర్యాటక రంగాన్ని కూడా కలుపుకుంటే భారత విమానయాన రంగం 77 లక్షల మందికి ఉపాధి, జీడీపీకి 1.5 శాతం సమకూరుస్తోందన్నారు.

ప్లాంట్ పెట్టేందుకు రెడీ: ఎంబ్రాయర్

భారత్‌లో పూర్తి స్థాయి అసెంబ్లింగ్ ప్లాంట్ ఏర్పాటు చేసేందుకు బ్రెజిల్‌కు చెందిన ఎంబ్రాయర్ విమానాల తయారీ సంస్థ సంసిద్ధత వ్యక్తం చేసింది. కాకపోతే ఇందుకు భారత విమానయాన సంస్థల నుంచి కనీసం 200 విమానాల ఆర్డర్ అవసరమని కంపెనీ ప్రెసిడెంట్, సీఈఓ ఫ్రాన్సిస్కో గోమెస్ నెటో స్పష్టం చేశారు. ఐఏటీఏ సదస్సుకు హాజరైన ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ విషయం చెప్పారు. తమ విమానాలు అమ్మేందుకు ఇండిగో, ఎయిర్ ఇండియా సంస్థలతో చర్చలు జరుపుతున్నట్టు నెటో వెల్లడించారు.

అదానీ గ్రూప్‌పై అమెరికా దర్యాప్తు!

గుట్టుగా ఇరాన్ ఎల్‌పీజీ దిగుమతి
తోసిపుచ్చిన అదానీ గ్రూప్

న్యూఢిల్లీ: గౌతమ్ అదానీ గ్రూప్ మరోసారి వివాదాల్లో చిక్కుకుంది. గుజరాత్‌లోని తన ముంద్రా రేవు ద్వారా కొన్ని కంపెనీలు ఇరాన్ ఎల్‌పీజీ దిగుమతి చేసుకునేందుకు సహకరించిందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ ఆరోపణలపై అమెరికా దర్యాప్తు సంస్థలు దర్యాప్తు ప్రారంభించినట్టు వాల్‌స్ట్రీట్ జర్నల్ ఒక కథనం ప్రచురించింది. అయితే అదానీ గ్రూప్ ఈ ఆరోపణలను తోసిపుచ్చింది. ఇరాన్ నౌకలు ఏవీ కూడా ఎల్‌పీజీతో తమ రేవులకు రాలేదని స్పష్టం చేసింది. ఈ విషయంలో తమపై అమెరికా సంస్థలు దర్యాప్తు జరుపుతున్న విషయం కూడా తమకు తెలియదని తెలిపింది. కొన్నిసంస్థలు దురుద్దేశాలతో తమపై కావాలనే ఇలాంటి నిరాధారమైన ఆరోపణలు ప్రచారం చేస్తున్నాయని అదానీ గ్రూప్ తెలిపింది. 'మా రేవుల ద్వారా ఇరాన్ నుంచి వచ్చే ఎలాంటి సరుకుల ఎగుమతి, దిగుమతులను అనుమతించడం లేదు. అది మా విధానపరమైన నిర్ణయం. ఇరాన్ జెండాతో వచ్చే నౌకలు లేదా నేరుగా ఇరాన్ రేవుల నుంచి వచ్చే నౌకలు అన్నిటికీ ఇది వర్తిస్తుంది' అని తెలిపింది.

ఈ విడత 0.50% వడ్డీకోత: ఎస్‌బీఐ

దేశంలో రుణ విభాగాన్ని ఉత్తేజితం చేయడంతో పాటు పలు రకాల అస్థిరతలను దీటుగా ఎదుర్కొనగల శక్తి కల్పించడం కోసం రిజర్వ్ బ్యాంక్ ఈసారి అర శాతం మేరకు రెపోరేటును తగ్గించవచ్చని ఎస్‌బీఐ అంచనా వేస్తోంది. బుధవారం ఆర్‌బీఐ ద్రవ్య విధాన కమిటీ (ఎంపీసీ) సమావేశాలు ప్రారంభమవుతాయి. శుక్రవారం ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా ఎంపీసీ నిర్ణయాలను ప్రకటించనున్నారు.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	97,640 ▲	89,500 ▲	1,11,000 ▲
విజయవాడ	1,00,000 ▲	94,000 ▲	1,00,000 ▲
విశాఖపట్నం	99,820 ▲	89,500 ▲	1,11,000 ▲
రాజమండ్రి	98,840 ▲	90,600 ▲	1,00,300 ▲
ప్రొద్దుటూరు	96,250 ▲	88,550 ▲	98,600 ▲
ముంబై	96,680 ▲	88,559 ▲	97,761 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



3వ తేదీ			
హైదరాబాద్	525	విజయవాడ	525
వరంగల్	527	గోదావరి	510
చిత్తూరు	613	విశాఖపట్నం	535
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	107	విజయవాడ	109
వరంగల్	107	గుంటూరు	112
కరీంనగర్	107	ఒంగోలు	112
మహబూబ్‌నగర్	107	చిత్తూరు	97
కర్నూలు	107	నెల్లూరు	102
విశాఖపట్నం	101	అనంతపురం	102
గోదావరి	109		

విదేశీ కంపెనీలు ఉత్పత్తికి సై అంటే దిగుమతి సుంకం 15 శాతమే..

8,000 ఈవీలకు మాత్రమే అనుమతి
దేశీయ తయారీపై కనీస పెట్టుబడి రూ.4,150 కోట్లు ఉండాలి
కొత్త ఈవీ పాలసీ మార్గదర్శకాలు విడుదల

న్యూఢిల్లీ: దేశీయంగా విద్యుత్ వాహనాల (ఈవీ) తయారీకి ముందుకు వచ్చే విదేశీ కంపెనీలకు దిగుమతి సుంకాలు గణనీయంగా తగ్గించనున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. ఈవీల స్థానిక తయారీని పటిష్ఠం చేయడం, ప్రపంచ పారిశ్రామికవేత్తలను ఆకర్షించడం లక్ష్యంగా రూపొందించిన కొత్త ఈవీ విధానం మార్గదర్శకాలను ప్రభుత్వం సోమవారం నోటిఫై చేసింది. దీంతో ఈ పాలసీ ఇప్పుడు అమలులోకి వచ్చినట్టవుతుంది. దాని ప్రకారం ఈవీల తయారీలో కనీసం రూ.4,150 కోట్ల పెట్టుబడులు పెట్టే ఆటో తయారీదారులను 15% తగ్గింపు సుంకంపై 8,000 ఈవీలు దిగుమతి చేసుకునేందుకు అనుమతిస్తారు. అయితే అనుమతులు పొందిన తేదీ నుంచి మూడు సంవత్సరాల్లోగా ఉత్పత్తి కార్యకలాపాలు ప్రారంభించడంతో పాటు తయారీలో ఎంత శాతంలో స్థానిక ఉత్పత్తులు వినియోగించేది ప్రకటించాల్సి ఉంటుంది.

ఈ పథకం కింద దరఖాస్తు చేసుకునేందుకు వీలుగా రెండు వారాల్లో ప్రత్యేక విభాగం ఏర్పాటవుతుందని, 120 రోజులు అది అందుబాటులో ఉంటుందని అధికారి ఒకరు తెలిపారు. ఆ తర్వాత కూడా వచ్చే ఏడాది మార్చి 15 వరకు ఎప్పుడు అవసరం అనుకుంటే అప్పుడు దరఖాస్తుల విభాగాన్ని తెరిచే అవకాశం ఉంది. ఈ స్కీమ్ కింద ఒక్కో దరఖాస్తుదారునిపై కోల్పోయే సుంకాల గరిష్ఠ పరిమితి రూ.6,484 కోట్లుగా ఉండనుందన్నారు.

భారత్‌లో తయారీపై టెస్లా అనాసక్తి

ప్రపంచ ఆటోమొబైల్ కంపెనీలు మెర్సిడెస్ బెంజ్, స్కోడా-ఫోక్స్‌వేగన్, హ్యుండయ్, కియా దేశంలో విద్యుత్ కార్ల తయారీపై ఆసక్తిని ప్రకటించాయని ఈ పాలసీ మార్గదర్శకాల విడుదల సందర్భంగా కేంద్ర భారీ పరిశ్రమల మంత్రి హెచ్‌డీ కుమారస్వామి తెలిపారు. అయితే ప్రపంచ ఈవీ దిగ్గజం టెస్లా మాత్రం దేశీయ తయారీ పట్ల ఆసక్తిగా లేదని, దేశంలో తమ షోరూమ్‌లు ప్రారంభించేందుకు మాత్రం సిద్ధంగా ఉన్నదని ఆయన చెప్పారు.

మార్కెట్లో మళ్లీ వాణిజ్య, యుద్ధ భయాలు

» సెన్సెక్స్ 77 పాయింట్లు డౌన్

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లను మళ్లీ వాణిజ్య, యుద్ధ భయాలు అలుముకున్నాయి. స్టీల్, అల్యూమినియంపై సుంకాలను రెట్టింపు చేయనున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించడం, ఈ మధ్యనే కుదుర్చుకున్న వాణిజ్య ఒప్పందాన్ని ఉల్లంఘించారంటూ అమెరికా-చైనా పరస్పర ఆరోపణలు, రష్యా-ఉక్రెయిన్ మధ్య యుద్ధం మళ్లీ తీవ్రతరం కావడం, ముడి చమురు ధరల పెరుగుదల, విదేశీ సంస్థాగత పెట్టుబడుల ఉపసంహరణ వంటి అంశాలు ట్రేడింగ్ సెంటిమెంట్‌కు గండికొట్టాయి. దాంతో సోమవారం సెన్సెక్స్ ప్రారంభ ట్రేడింగ్‌లో 796.75 పాయింట్లు క్షీణించి 80,654 వద్ద ఇంట్రాడే కనిష్ఠాన్ని నమోదు చేసింది. ఆ తర్వాత క్రమంగా కోలుకున్న సూచీ చివరికి 77.26 పాయింట్ల నష్టంతో 81,373.75 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం ప్రారంభంలో 224.55 పాయింట్ల వరకు కోల్పోయినప్పటికీ, చివరికి 34.10 పాయింట్ల నష్టంతో 24,716.60 వద్ద స్థిరపడింది. గత ఆర్థిక సంవత్సరానికి జీడీపీ వృద్ధి ప్రభుత్వ అంచనాలకు అనుగుణంగా 6.5 శాతంగా నమోదవడంతో పాటు జీఎస్‌టీ వసూళ్లు వరుసగా రెండో నెలా రూ.2 లక్షల కోట్లు దాటడం, ఈసారి ఆర్‌బీఐ రెపో రేటును అర శాతం వరకు తగ్గించవచ్చన్న అంచనాలు సూచీల రికవరీకి తోడ్పడ్డాయి.

మీనాక్షి ఆల్టర్నేట్స్ రియల్టీ ఫోకస్డ్ ఫండ్

700 కోట్ల కార్పస్‌తో ఏర్పాటు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్‌కు చెందిన రియల్టీ, శుద్ధ ఇంధన వ్యాపారాల నిర్వహణలోని మీనాక్షి గ్రూప్ తాజాగా ఆర్థిక సేవల రంగంలోకి ప్రవేశించింది. మీనాక్షి ఆల్టర్నేట్స్ (ఎం-ఆల్ట్స్) పేరుతో ఆర్థిక సేవల అనుబంధ విభాగంతో పాటు దాని పరిధిలో తొలి ఫండ్‌ను కూడా ఏర్పాటు చేసినట్లు మీనాక్షి గ్రూప్ వెల్లడించింది.

'మీనాక్షి రియల్ అసెట్స్ ఫండ్' పేరుతో రూ.700 కోట్ల కార్పస్‌తో ఈ ఫండ్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపింది. సెబీ అనుమతితో కూడిన కేటగిరీ-2 ఆల్టర్నేటివ్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్ (ఏఐఎఫ్) ఇది.

విడుదలకు సిద్ధమైన ఘాటీ



అనుష్క శెట్టి ప్రధాన పాత్రలో క్రిష్ జాగర్లమూడి తెరకెక్కిస్తున్న చిత్రం 'ఘాటీ'. తమిళ నటుడు విక్రమ్ ప్రభు కీలక పాత్ర పోషిస్తున్నారు. రాజీవ్‌రెడ్డి, సాయిబాబు జాగర్లమూడి నిర్మిస్తున్నారు. ఇటీవలె విడుదలైన గ్లింప్స్ సినిమాపై అంచనాలను పెంచేసింది. తాజాగా, ఈ సినిమాను జూలై 11న ప్రేక్షకుల ముందుకు తెస్తున్నట్లు ప్రకటించి ఓ పోస్టర్‌ను విడుదల చేశారు మేకర్స్. సినిమాలోని ప్రధాన పాత్రధారులు సంచులు మోసుకుంటూ నదిని దాటుతున్న విజువల్స్ ఆకర్షణీయంగా ఉన్నాయి. ఈ చిత్రానికి ఎడిటర్: చాణక్యరెడ్డి తూరుపు, వెంకట్ ఎన్.స్వామి, సినిమాటోగ్రఫీ:మనోజ్‌రెడ్డి కాటసాని, సంగీతం:నాగవెల్లి విద్యాసాగర్. కాగా, 'వేదం' తర్వాత క్రిష్, అనుష్క కాంబోలో తెరకెక్కుతున్న ఈ సినిమాపై అంచనాలు భారీగా ఉన్నాయి.

ధనుష్ నటనకు జాతీయ అవార్డు వస్తుంది





శేఖర్ కమ్ముల

నాగార్జున, ధనుష్, రష్మిక మందన్న ప్రధాన పాత్రల్లో శేఖర్ కమ్ముల తెరకెక్కించిన చిత్రం 'కుబేర'. సునీల్ నారంగ్, పుష్కర్ రామ్మోహన్ నిర్మించారు. ఈ నెల 20న ప్రేక్షకుల ముందుకు వస్తోంది. తాజాగా, చెన్నైలో ఆడియో వేడుక నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దర్శకుడు శేఖర్ కమ్ముల మాట్లాడుతూ "ఇదో అద్భుతమైన చిత్రం. ప్రేక్షకులకు కొత్త అనుభూతినిస్తుంది. నాగార్జున, ధనుష్‌ల నటన నెక్స్ట్ లెవెల్‌లో ఉంటుంది. ధనుష్ ఆల్‌రౌండర్. ఈ చిత్రంలో ఆయన నటనకు జాతీయ అవార్డు వస్తుంది" అని అన్నారు. "సినిమా ప్రేక్షకులకు కచ్చితంగా నచ్చుతుంది. శేఖర్ కమ్ముల అద్భుతంగా సినిమాను తెరకెక్కించారు. రజనీకాంత్‌తో నేను నటించిన 'కూలీ' సినిమా మీ అందరి ఊహలకు మించి ఉండబోతోంది" అని నాగార్జున చెప్పారు. "శేఖర్ కమ్ముల స్వచ్ఛమైన మనసు ఉన్న వ్యక్తి. ఇందులో చేసిన పాత్ర నాకెంతో ప్రత్యేకం" అని ధనుష్ తెలిపారు.

ఎంత దుష్ప్రచారం చేస్తారో చేస్కోండి

తనపై వస్తున్న దుష్ప్రచారాలపై ధనుష్ ఈ సందర్భంగా స్పందించారు. "నేనెప్పుడూ నా బెస్ట్ ఇవ్వడానికే ప్రయత్నిస్తుంటాను. నాపై, నా సినిమాలపై ఎంతగా దుష్ప్రచారం చేస్తారో చేసుకోండి. నా సినిమాల విడుదలకు ముందు ప్రతిసారి ఏదో ఒక విషయంలో కుట్రలు పన్నుతూనే ఉంటారు. అయినా ఆ ప్రయత్నాలు నన్నేమీ చేయలేవు. నా అభిమానులు 23 ఏళ్లుగా నా వెన్నంటే ఉన్నారు. ఇలాంటి సర్కస్‌లు చేయడం మానుకోండి. ఎవరెంత దుష్ప్రచారం చేసినా అభిమానులు నాతోనే ఉంటారు" అని పేర్కొన్నారు.

ఫిల్మ్ చాంబర్‌లో 'వీరమల్లు' నిర్మాత



సినిమా టికెట్ ధరల పెంపు లేదా ఏ ఇతర విషయాలకు సంబంధించి అయినా సినీ పరిశ్రమకు చెందిన వారితో వ్యక్తిగత చర్చలకు తావులేదని ఇటీవలె ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పష్టం చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే పవన్ సూచన మేరకు 'హరి హర వీరమల్లు' చిత్ర నిర్మాత ఏ.ఎం.రత్నం తాజాగా ఫిల్మ్ చాంబర్ అధ్యక్షుడు భరత్ భూషణ్‌ను కలిశారు. తమ చిత్రానికి సంబంధించి అదనపు షోలకు అనుమతి, టికెట్ ధరల సవరణ కోరుతూ లేఖను అందజేశారు. 'హరి హర వీరమల్లు' సినిమా ఈనెల 12న విడుదల కానుంది.

మనసును తాకేలా



సిద్ధు జొన్నలగడ్డ, రాశీ ఖన్నా, శ్రీనిధి శెట్టి ప్రధాన పాత్రల్లో తెరకెక్కుతున్న సినిమా 'తెలుసు కదా'. నీరజ కోన దర్శకత్వంలో టీజీ విశ్వప్రసాద్, టీజీ కృతిప్రసాద్ నిర్మిస్తున్నారు. తాజాగా, ఈ సినిమా విడుదల తేదీని ప్రకటించారు మేకర్స్. దీపావళి సందర్భంగా అక్టోబర్ 17 సినిమాను ప్రేక్షకుల ముందుకు తెస్తున్నట్లు ఓ పోస్టర్‌ను విడుదల చేశారు. ఊహించని మలుపులతో నిండిన ఈ సినిమా ప్రేక్షకుల మనసును తాకేలా ఉంటుందని తెలిపారు.

థగ్‌లైఫ్‌ను అడ్డుకుంటాం



కన్నడ భాష గురించి నటుడు కమల్ హాసన్ చేసిన వ్యాఖ్యలతో థగ్‌లైఫ్ సినిమాను కష్టాలు వెంటాడుతున్నాయి. ఈ నెల 5న సినిమాను కర్నాటకలో విడుదల చేస్తే థియేటర్లకు నిప్పు పెడతామని కర్ణాటక రక్షణ వేదిక(కరవే) రాష్ట్ర అధ్యక్షుడు నారాయణ గౌడ హెచ్చరించారు. కన్నడ సంఘాల ఐక్యకూటమి అధ్యక్షుడు వాటాళ్ నాగరాజ్ మైసూరులో సోమవారం మీడియాతో మాట్లాడుతూ, కమల్‌హాసన్ సినిమాను బహిష్కరించాల్సిందేనని అన్నారు.

హైకోర్టును ఆశ్రయించిన కమల్ హాసన్

థగ్‌లైఫ్ సినిమాకు వస్తున్న బెదిరింపులపై కమల్ హాసన్, కర్ణాటక హైకోర్టును ఆశ్రయించారు. సినిమా ప్రదర్శనకు ఎలాంటి అడ్డంకులు లేకుండా తగిన భద్రత కల్పించేలా చూడాలని కోర్టుకు విన్నవించారు. ఇదిలా ఉంటే తమిళం నుంచి కన్నడ పుట్టిందని కమల్ హాసన్ వ్యాఖ్యానించినప్పుడు తాను చప్పట్లు కొట్టలేదని నటుడు శివరాజ్‌కుమార్ వివరణ ఇచ్చారు. అన్ని భాషలూ ముఖ్యమైనవేనని, తన మాతృభాష కన్నడకే ప్రాధాన్యం ఇస్తానని అన్నారు. ఇందులో ఎలాంటి సందేహం లేదని ఇంతకు ముందే చెప్పానని అన్నారు. కన్నడ కోసం తన ప్రాణమైనా ఇస్తానని అన్నారు.

- బెంగళూరు (ఆంధ్రజ్యోతి)



ఖమ్మంలో పోలీసుల గౌరవ వందనం



పరేడ్ గ్రౌండ్‌లో వేడుకలను వీక్షిస్తున్న ప్రజలు



కొత్తగూడెం ప్రగతి మైదానంలో సాంస్కృతిక కార్యక్రమం



విద్యార్థులను అభినందిస్తున్న మంత్రి తుమ్మల, ఎమ్మెల్యే కూనంనేని

అమరుల త్యాగాల స్ఫూర్తితో అభివృద్ధి

- చిత్తశుద్ధితో ప్రజల వద్దకు ప్రభుత్వ పథకాలు
- 'సీతారామ'తో ఉమ్మడి జిల్లా సస్యశ్యామలం
- రైజింగ్ 2047విజన్‌తో ముందుకెళ్తున్నాం
- గిరిజన భూముల సాగు కోసం ఇందిర సౌర గిరిజల వికాసం
- హైవేలు, రైల్వేలైన్ల మంజూరుతో మారుతున్న రూపురేఖలు
- రాష్ట్ర ఆవిర్భావ వేడుకల్లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి తుమ్మల నాగేశ్వరావు
- ఖమ్మంలో పతాకావిష్కరణ చేసిన భట్టి.. కొత్తగూడెంలో జెండా ఎగురవేసిన తుమ్మల

ఖమ్మం (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) / కొత్తగూడెం జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : అమరుల త్యాగాల స్ఫూర్తితో అభివృద్ధి చేస్తున్నామని, తద్వారా రాష్ట్రాన్ని దేశంలోనే కాకుండా ప్రపంచ స్థాయిలో అగ్రగామిగా నిలిపేందుకు సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రైజింగ్-2047 విజన్‌తో ప్రజాప్రభుత్వం ముందుకు సాగుతోందని డిప్యూటీసీఎం మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. సోమవారం రాష్ట్ర అవతర వేడుకల సందర్భంగా ఖమ్మం పోలీస్ పరేడ్ మైదానంలో జరిగిన వేడుకల్లో డిప్యూటీసీఎం భట్టి, కొత్తగూడెం ప్రగతి మైదానంలో జరిగిన వేడుకల్లో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొన్నారు. అమరులకు నివాళులర్పించిన అనంతరం వారు జాతీయపతాకాలను ఆవిష్కరించి పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా వారు ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి కోసం తమ ప్రజాప్రభుత్వం విజన్ 2047తో ముందుకుసాగుతోందన్నారు. ఇందులో పేదల సంక్షేమం, సమగ్రపాలసీల రూపకల్పన, ప్రపంచ స్థాయి ఇన్ఫ్రా డెవలప్‌మెంట్, పారదర్శక స్వపరిపాలన అనే నాలుగు అంశాలున్నాయన్నారు. ఈ లక్ష్యాల సాధనకు పభుత్వం ఇప్పటికే తగు చర్యలు చేపట్టిందన్నారు. అలాగే వెల్ఫేర్ అండ్ సోషల్ జస్టిస్ పాలసీ,



గ్రీన్ ఎనర్జీ పాలసీ, ఇన్‌ఫ్రా అండ్ ఇండస్ట్రియల్ పాలసీ, టూరిజం పాలసీలను ప్రభుత్వం సిద్ధం చేసిందన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఎనిమిది నెలల్లోనే 25,35,964మంది రైతులకు రూ. 20,617కోట్లు రుణమాఫీ చేశామన్నారు. రైతులకు రైతుభరోసా కింద ఎకరానికి రూ.12వేలు ఆర్థిక సహాయాన్ని అందచేస్తున్నామన్నారు. ధాన్యాన్ని కొనులోలు చేయడమే కాకుండా 24గంటల్లో వారి ఖాతాల్లో నగదు జమ చేస్తున్నామన్నారు. సన్న ధాన్యానికి క్వింటాలుకు రూ. 500 బోనస్ చెల్లిస్తున్నామన్నారు. అకాల వర్షాలకు పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.10వేలు నష్టపరిహారం ఇస్తున్నామన్నారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను ప్రక్షాళన చేసి విజయవంతంగా పరీక్షలు నిర్వహించి.. ఏడాదికాలంలో 55వేల మందికి ఉద్యోగాలు ఇచ్చామని గుర్తుచేశారు. యంగ్‌ఇండియా ఇంటిగ్రేటెడ్ మోడల్‌స్కూళ్లను 25ఎకరాల విస్తీర్ణంలో నిర్మించేలా రాష్ట్రంలో 58 పాఠశాలల నిర్మాణానికి శ్రీకారం చుట్టామన్నారు. అభివృద్ధికి విద్యాకమిషన్‌ను కూడా ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటికే గృహనిర్మాణాలు చేపట్టామన్నారు. గిరిజనుల భూములు, సాగునీరు, విద్యుత్ సదుపాయానికి ఇందిర సౌర గిరిజన వికాస కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు.

నీటి పారుదల రంగానికి ప్రాధాన్యం

» డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

తమ ప్రభుత్వం నీటిపారుదల రంగానికి ప్రాధాన్యమిస్తోందని, ఈ క్రమంలోనే జిల్లాలో యాసంగి పంట ఎండిపోకుండా కాపాడేందుకు సీతారామ ప్రాజెక్టు కింద రూ.100కోట్లతో రాజీవ్ కెనాల్ నిర్మించి 1,25000 వేల ఎకరాలు ఆయకట్టును స్థిరీకరించామని డిప్యూటీసీఎం భట్టి విక్రమార్క పేర్కొన్నారు. పాలేరు లింక్‌కెనాల్, యాతాలకుంట ట్రంక్‌కెనాల్ పనులతోపాటు డిస్ట్రిబ్యూటరీ కెనాల్ పనులు వేగంగా చేస్తున్నామని, రఘునాధపాలెం మండలంలో మంచుకొండ ఎత్తిపోతల పథకాన్ని రికార్డు సమయంలో నిర్మించామన్నారు. మున్నేరునుంచి రూ.102.92కోట్లతో పాలేరు లింక్‌కెనాల్‌కు కూడా టెండర్లు పిలిపించామని, రూ.525.36కోట్లతో మున్నేరుకి ఇరువైపులా వరద రక్షణ గోడను నిర్మిస్తున్నామన్నారు. భారతి పథకం అమల్లో భాగంగా మొదటివిడతగా నేలకొండపల్లి మండలంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించి 3,224 దరఖాస్తులు స్వీకరించామన్నారు. బోనకల్ మండలాన్ని రెండో విడత పైలెట్ మండలంగా ఎంపిక చేసి సదస్సులు నిర్వహించామని, ఇక 3వ తేదీ నుంచి 17వరకు అన్ని మండలాల్లో రెవెన్యూ సదుస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. జిల్లాలో కొత్తగా 5298 కుటుంబాలకు రేషన్‌కార్డులు మంజూరుచేశామని, మొత్తం 3,84,734 కుటుంబాలకు రేషన్ లబ్ధి జరుగుతోందన్నారు. అభయహస్తం గ్యారంటీ పథకాల కింద మహిళలకు ఆర్టీసీలో ఉచిత బస్సుప్రయాణం కల్పించడం ద్వారా రూ.167.89కోట్లు మహిళలకు ఆదా అయ్యిందన్నారు. ఆరోగ్యశ్రీ పథకం పరిధిని రూ.10లక్షలకు పెంచామని, ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద రూ.5లక్షలు అందిస్తూ ప్రతీ నియోజకవర్గంలో 3,500 ఇళ్లు మంజూరు చేశామన్నారు. ఈ క్రమంలో ఖమ్మం జిల్లాకు 17,342 ఇళ్లు కేటాయించగా ఇప్పటివరకు 14,629 లబ్దిదారుల ఎంపిక జరిగిందన్నారు.

మహిళా డెయిరీతో పాడిపరిశ్రమ అభివృద్ధి

ఇందిర మహిళ డైరీ ద్వారా మధిర నియోజకవర్గంలో 21వేల స్వయం సహాయక సంఘ సభ్యులకు పాడి గేదెలు ఇచ్చి పాలసేకరణ చేపట్టామని తెలిపారు. జిల్లాలో వ్యవసాయరంగానికి పెద్దపీట వేశామని, రూ.2లక్షల రుణ మాఫీ కింద 1,31,760మంది రైతులకు రూ.912.10కోట్లు రుణమాఫీ చేసి ఖాతాల్లో జమచేశామన్నారు. ఎకరానికి రూ.12వేలు రైతుభరోసా అందిస్తున్నారు. తద్వారా 2,89,000వేల మంది రైతులకు రూ.259.74కోట్లు రైతు ఖతాల్లో జమచేశామని తెలిపారు రైతుబీమా పథకం కిందకూడా రైతులు మరణించిన వారి ఖాతాల్లో 521మది రైతులకుటుంబాలకు రూ.26.05కోట్లు వారి వారసుల ఖాతాల్లోజమచేశామని వివరించారు. యాసంగిలో 351 కొనుగోలు కేంద్రాలతో 32,102మంది రైతులనుంచి 21,66,180 క్వింటాళ్ల ధాన్యం కొన్నామని, రూ.384కోట్లు రైతుల ఖాతాల్లో జమచేశామన్నారు. సన్నధాన్యానికి క్వింటాకు రూ.500బోనస్ అందిస్తున్నామన్నారు. ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహిస్తున్నామని, రాయితీపై డ్రిప్ ఇరిగేషన్ ఇస్తున్నామన్నారు. మోడల్ మార్కెట్, సహకార సంఘాల ద్వారా ఎరువుల సరఫరా, సోలార్ విద్యుత్‌ప్లాంట్లు, గ్రామీణ వికాసం కింద కూలీలకు పనిదినాలు, ప్రభుత్వ పాఠశాలల బలోపేతం, ఇందిర మహిళ శక్తికింద మహిళ మార్టు, క్యాంటీన్లు, స్త్రీ టీస్టాల్స్, పేదలకు మెరుగైన వైద్యం, మెడికల్ కళాశాలలు ఇలా అనేక సంక్షేమ పథకాలు, కార్యక్రమాలు అములచేస్తున్నామన్నారు. రోడ్ల నిర్మాణంలో వేగం, క్రీడలు, పర్యాటక అభివృద్ధికి, మునిసిపల్‌పట్టణాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేకదృష్టి పెట్టిందన్నారు. వేడుకల్లో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, సీపీ సునీల్‌దత్, అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి, మేయర్ నీరజ, జడ్పీసీఈవో దీక్షా రైనా, డీసీసీబీ చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు దుర్గాప్రసాద్, మాజీ ఎమ్మెల్సీలు బాలసాని లక్ష్మీనారాయణ, పోట్ల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా తెలంగాణ అమరవీరుల కుటుంబాలను భట్టి సన్మానించారు.అనంతరం ఖమ్మంసీపీ కార్యాలయంలో ఆయన జిల్లా అధికారులతో సమావేశమై ఆయా శాఖల ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై ఆరా తీశారు.



ఖమ్మంలో గౌరవ వందనం స్వీకరిస్తున్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



ప్రసంగిస్తున్న మంత్రి తుమ్మల

రాష్ట్రం ఇచ్చిన కాంగ్రెస్‌నే ప్రజలు కోరుకున్నారు

» సత్తుపల్లిలో మంత్రి తుమ్మల

సత్తుపల్లి, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): తెలంగాణా ప్రాంతం అభివృద్ధిలో వెనుకబడిందని ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు ద్వారానే మన అభివృద్ధి జరుగుతుందనే ఆకాంక్షతో ఉద్యమం దశాబ్దాల కాలం కొనసాగిందని వ్యవసాయ శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఈ ప్రాంత ప్రజల ఆకాంక్షలను కాంగ్రెస్ నెరవేరుస్తూ రాష్ట్రాన్ని ఇచ్చిందన్నారు. సోమవారం సత్తుపల్లిలో జరిగిన రాష్ట్ర అవతరణ ర్యాలీలో సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయితో కలసి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం ఏర్పడిన తరువాత రాష్ట్రాన్ని పాలించిన పార్టీ వల్ల ప్రజల ఆకాంక్ష నెరవేరలేదని, ఈ కారణంగానే రాష్ట్రం ఇచ్చిన కాంగ్రెస్‌ను ప్రజలు కోరుకున్నారని అన్నారు. బడుగు, బలహీన వర్గాలకు, రైతులు, కూలీలు, మహిళలకు న్యాయం జరుగుతుందని భావించిన ప్రజలు కాంగ్రెస్‌ను నమ్మారని అన్నారు. సోనియాగాంధీ ఇచ్చిన హామీలన్నీ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. సత్తుపల్లి నియోజకవర్గ అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తామని అన్నారు.

ఎందరో బలిదానాలు: ఎమ్మెల్యే

రాష్ట్రం కోసం ఎందరో బలిదానాలు చేశారని, బలిదానాలకు చలించిపోయిన సోనియాగాంధీ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు చేశారని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి అన్నారు. బంగారు తెలంగాణా చేస్తామని నమ్మించి బీఆర్ఎస్ పదేళ్ల కాలంలో ప్రజలను మోసం చేసిందన్నారు. గత దొరల పాలన పట్ల విసుగు చెందిన ప్రజలుకాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకొని వచ్చారని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్రనాయకుడు డాక్టర్ మట్టా దయానంద్ పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా వరప్రదాయని సీతారామ

» వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



కొత్తగూడెంలో గౌరవ వందనం స్వీకరిస్తున్న తుమ్మల

ఉమ్మడిజిల్లా వరప్రదాయనిగా నిలుస్తున్న సీతారామ ఎత్తిపోతల పథకం ప్రధాన కాల్వల పనులను పూర్తిచేసుకుని మూడు పంపుహౌస్‌లను ఇప్పటికే ముఖ్యమంత్రి, పలువురు మంత్రులతో ప్రారంభింపజేశామని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. కొత్తగూడెంలో జరిగిన వేడుకల్లో మాట్లాడిన ఆయన ప్రధాన కాల్వ నుంచి ఏన్కూరు లింకు కెనాల్ ద్వారా సీతారామ ప్రాజెక్టునీటిని విడుదల చేశామని, ఉపప్రధాన కాల్వ పనులకు టెండర్లు జరుగుతున్నాయన్నారు. ఈ సీతారామ ప్రాజెక్టు ద్వారా భద్రాద్రి జిల్లాలో 1,57,574 ఎకరాల కొత్త ఆయకట్టు, చిన్ననీటి తరహా చెరువుల కింద 42,935 ఎకరాలు స్థిరీకరణకు ప్రతిపాదనలు జరిగాయన్నారు. సీతమ్మసాగర్ బహుళార్థక సాధక ప్రాజెక్టు కోసం 3,123ఎకరాల భూసేకరణ పూర్తయిందని, మధ్యతరహా సాగునీటి ప్రాజెక్టుల ద్వారా జిల్లాలో పెద్దవాగు, తాలిపేరు, కిన్నెరసాని ప్రాజెక్టులకు 37,060ఎకరాలకు, 20,354 చిన్న తరహా నీటి వనరులున్నాయని, వీటి ఆయకట్టు కింద 1,29,058 ఎకరాలకు నీరందుతోందన్నారు. గత ఆర్థిక సంవత్సరంలో రూ.415కోట్లతో 108 రహదారుల పనులు చేపట్టగా వాటిలో 75 పూర్తవగా 33పనులు పురోగతిలో ఉన్నాయన్నారు. గ్రామీణ అంతర్గత రహదారులను కలుపుతూ 24రోడ్లు, 18బ్రిడ్జిలు నిర్మాణ పనులకు గాను రూ. 195కోట్లు మంజూరయ్యాయన్నారు. వీటిలో 15పనులు పూర్తి కాగా 37 పురోగతిలో ఉన్నాయన్నారు. ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట నుంచి కొత్తగూడెం, భద్రాచలం నుంచి కొవ్వూరు వరకు జాతీయ రహదారులు నిర్మాణ పనులు మంజూరు దశలో ఉన్నాయన్నారు. పాండురంగాపురం నుంచి మల్కాన్‌గిరి వరకు రైల్వేలైన్ పనులు మంజూరయ్యాయని, మొదటి దశలో పాండురంగాపురం నుంచి సారపాక వరకు రైల్వేలైన్ పనులు పూర్తి చేయాలని కోరామన్నారు. కొత్తగూడెంలో విమానాశ్రయ ఆమోదానికి కేంద్రం ద్వారా ముమ్మర ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. జిల్లాలో రూ.38.5కోట్ల నిధులతో విద్యుత్ ఉపకేంద్రాలు, రూ.3.67కోట్లతో కొత్తగా ఐదు 33కేవీ సబ్‌స్టేషన్లు పూర్తి చేశామన్నారు. ప్రపంచ వ్యాప్తంగా జిల్లా ఖ్యాతి మారు మోగేలా దేశంలోనే ఎర్త్‌సైన్స్ యూనివర్సిటీ నిర్మాణానికి అడుగులు పడుతున్నాయన్నారు. నేటి నుంచి అన్ని మండలాల్లో భూభారతి చట్టాన్ని అమల్లోకి తీసుకొచ్చామని, 20వతేదీ వరకు గ్రామాల వారీగా రెవెన్యూ సదస్సులు జరుగుతాయన్నారు. పథకాలను విజయవంతం చేస్తున్న అధికారులు, ఉద్యోగులు, ప్రజలు, ప్రజాప్రతినిధులు, మీడియా ప్రతినిధులు, శాంతిభద్రత రక్షణకు కృషి చేస్తున్న పోలీసు యంత్రాంగానికి ఆయన ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న వివిధ సంక్షేమ పథకాల శకటాలను మంత్రి పరిశీలించారు. పలువురు రైతులకు విత్తనాలను అందజేశారు. స్వాతంత్ర్యసమరయోధులను సత్కరించారు. కార్యక్రమంలో కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్, జిల్లాలోని పలు శాఖల ఉన్నతాధికారులు, అధికారులు, ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దేశ విద్యుత్ అవసరాలకు బొగ్గు సరఫరా

» సింగరేణి సీఎండీ బలరాం

రుద్రంపూర్, (సింగరేణి) జూన్ 2 (ఆంధ్రజ్యోతి): దేశ విద్యుత్ అవసరాలకు సింగరేణి బొగ్గును సరపరా చేస్తున్నట్లు సింగరేణి చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్. బలరాం తెలిపారు. బొగ్గు ఉత్పత్తిలో 136 సంవత్సరాల అనుభవం ఉన్న సింగరేణి విద్యుత్ ఉత్పత్తి రంగంలో పయణించి విజయాలు సాధిస్తుందని ప్రకటించారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలో భాగంగా సోమవారం సింగరేణి ప్రకాశం గ్రౌండ్‌లో జాతీయ జెండాను ఆవిష్కరించారు. సెక్యూరిటీ సిబ్బందితో గౌరవవందనం స్వీకరించిన అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ కర్ణాటక, తమిళనాడు, మహరాష్ట్ర, ఆంధ్రప్రదేశ్‌తోపాటు అనేక రాష్ట్రాలకు చెందిన సుమారు 20 పెద్ద విద్యుత్ సంస్థలకు బొగ్గును సరపరా చేస్తున్నామని, 2వేల చిన్న పరిశ్రమలకు సైతం బొగ్గును అందిస్తూ దేశంలోనే అగ్రగామిగా నిలిస్తున్నామని తెలిపారు. విద్యుత్ ఉత్పత్తితోపాటు సోలార్ విద్యుత్‌రంగంలోకి పయణిస్తున్నామని, ఉద్యోగులు సమష్టి కృషి చేసి సింగరేణియాజమాన్యం నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాలను సాధించాలని కోరారు. రాజస్థాన్ రాష్ట్రంలో 1600మెగావాట్ల సోలార్ విద్యుత్‌ను ఉత్పత్తి చేసేందుకు అవసరమైన ఒప్పందాలు కుదుర్చుకోవడం జరిగిందని తెలిపారు. విదేశీ బొగ్గుసరపరా వల్ల మార్కెట్లో నిలతొక్కుకునేందుకు నాణ్యమైన బొగ్గును ఉత్పత్తి చేసేందుకు కార్మికులు శ్రమించాల్సిన అవసరం ఉందని విజ్ఞప్తి చేశారు. సింగరేణి సంస్థ 6 జిల్లాలో 12 ఏరియాల్లో 41వేల మంది కార్మికులతో సమర్థవంతంగా పని చేస్తుందని మరిన్ని బొగ్గు బ్లాక్‌లను సాధించే దిశగా అడుగులు వేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు కొప్పుల వెంకటేశ్వర్లు, ఎల్. సూర్యనారాయణ, గుర్తింపు కార్మికసంఘం నాయకులు రాజ్‌కుమార్, ప్రాతినిధ్య సంఘం నాయకులు పితంబరం, సీఎంవోఏ ఉపాధ్యక్షులు రాజీవ్‌కుమార్, జీఎంలు జీవీ. కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.



సోనియాగాంధీ ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి, సంక్షేమపాలన

» వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



ఖమ్మం, జూన్2 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్రాన్ని ఇచ్చిన సోనియాగాంధీ ఆకాంక్షలకు అనుగుణంగా రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమపాలన సాగుతుందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. రాష్ట్రంలో వరినాట్లు వేసేనాటికి రైతులదరికి రైతుభరోసా అందించి తీరుతామనిప్రకటించారు. సీతారామ సాగునీటి ప్రాజెక్టుతోపాటు జాతీయరహదారులు, రైల్వే ప్రాజెక్టులు కూడా పూర్తిచేసి తీరుతామని ప్రకటించారు. సోమవారం రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా ఖమ్మం నియోజకవర్గ వేడుకలను భక్తరామదాసు కళాక్షేత్రంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. గత 5 ఏళ్లలో బీఆర్ఎస్ పాలనలో రైతుసంక్షేమపథకాలు మట్టిపాలు చేశారు అన్ని వ్యవస్థలు సంస్థల్లో అప్పులు పెట్టి వెళ్లిపోతే కాంగ్రెస్ ప్రభుత్వం అన్నింటిని తీర్చుకుంటూ రైతుసంక్షేమాన్ని గాడిలో పెట్టిందన్నారు ఒకేసారి రూ.35వేలకోట్లు రైతురుణమాఫీచేసిన ఘనత రేవంత్‌రెడ్డి ప్రభుత్వానిదని గుర్తుచేశారు. మహిళలకు, రైతులకు, యువకులు అన్నివర్గాల వారికి సంక్షేమపథకాలు అమలుచేస్తున్నామని, తెలిపారు. రూ.10వే9లకోట్లతో పేదలకుసన్నబియ్యం అందిస్తున్నమని తెలిపారు. రాష్ట్రంలో రైతుసంక్షేమంకోసం రూ.40వేలకోట్లు ఖర్చుపెడుతున్నామని గుర్తుచేస్తూ నిరుపేదలకు 200యూనిట్లు ఉచిత విద్యుత్ రూ.500కు గ్యాస్ సిలిండర్ అందిస్తున్నాని తెలిపారు. కోటిమంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దడమే లక్ష్యమన్నారు. జిల్లాలోసీతారామ ఎత్తిపోతలపథకం పూర్తిచేయడంతోపాటు అన్ని రైల్వేప్రాజెక్టులు, జాతీయరహదారులు కూడా పూర్తిచేసి తీరుతామన్నారు. కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ కూడా పోలీసు అధికారి కుమారుడైనా ప్రజలతో కలిసి మెలిసి పనిచేస్తున్నారని ప్రశంసించారు. జిల్లాకలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ మాట్లాడుతూ అమ్మాయిపుడిఏత పండుగ వాతావరణం ఉండాలని అందుకే 'మాపాపమా ఇంటి మణిదీపం' మేయర్ పునుకొల్లు నీరజ, డిప్యుటీ మేయర్ ఫాతిమాజోహార, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మినారాయణ, ఏఎంసీ చైర్మ న్ యరగర్ల హనుమంతరావు, మాజీ కార్పొరేటర్లు కమర్తపు మురళి, గజ్జల లక్ష్మి చైర్మన్ మానుకొండ రాధాకిషోర్, కాంగ్రెస్ నాయకులు చోటాబాబా తదితరులు ప్రసంగిస్తూ మంత్రి తుమ్మల కృషితో ఖమ్మంజిల్లా నియోజకవర్గం ఎంతో అభివృద్ధి సాధిస్తుందన్నారు. ఆయనవిజన్ ఉన్న నాయకుడని తెలిపారు.

పేదల ముఖంలో చిరునవ్వులే లక్ష్యం

» తిరుమలాయపాలెంలో మంత్రి పొంగులేటి

తిరుమలాయపాలె, జూన్2 (ఆంధ్రజ్యోతి): పేదల ముఖంలో చిరునవ్వుల చూడడమే లక్ష్యంగా ఈ ఇందిరమ్మ ప్రభుత్వ పాలన సాగుతోందని రెవెన్యూ, గృహనిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. సోమవారం తిరుమలాయపాలెం మండలంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. ఈసందర్భంగా మంత్రి పొంగులేటి ప్రసంగించారు. ఇందిరమ్మ ప్రభుత్వం పేదల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తుందని, రాజీవ్ ఆరోగ్యశ్రీకింద రూ.10లక్షల పెంపు పేదలకు200ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత ఆర్టీసీబస్సు, రైతులకు ర.2లక్షల రుణమాఫీ, సన్నవడ్లకు రూ.500బోనస్, పేదలకు సన్నబియ్యం పంపిణీ వంటి కార్యక్రమాలు విజయవంతంగా రాష్ట్రంలో నిర్వహిస్తున్నామని అన్నారు. రాష్ట్రంలో మొదటి విడతగా 4.5 లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ఘనంగా చేపట్టబోతున్నామని, ధరణి పేరుతో రైతులు పేదల ఆస్తులకు భద్రత ఇస్తున్నామన్నారు. సమస్యలను అధికారులు గ్రామాలకు వచ్చి పరిష్కరించే అవకాశం లభించిందని, గత ప్రభుత్వం అప్పులభారం మోపి వెళ్లినా రాష్ట్ర అభివృద్ధికి ఎక్కడా అవరోధం లేకుండపాలన సాగుతుందన్నారు. మంత్రి పర్యటనలో నాయకులు మద్దినేని బేబి స్వర్ణకుమారి, రామసహాయం నరేష్ రెడ్డి, చావా శివరామకృష్ణ, బెల్లం శ్రీను, పలువురు అధికారులు పాల్గొన్నారు.



విత్తనాలు పంపిణీ చేస్తున్న మంత్రి

గిరిజనులు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలి

» ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి రాహుల్

భద్రాచలం, జూన్ 2(ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలో సంస్కృతి సంప్రదాయాలతో జీవిస్తున్న గిరిజనులు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని ఐటీడీఏ పీవో బి. రాహుల్ ఆకాంక్షించారు. భద్రాచలం ఐటీడీఏ కార్యాలయ ప్రాంగణంలో జరిగిన రాష్ట్ర అవతరణ వేడుకల్లో సోమవారం పీవో పాల్గొన్నారు. ముందుగా ఆయన పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించి అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించి తెలంగాణ తల్లి విగ్రహం వద్ద పూజలు జరిపి జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ఈ సందర్భంగా పీవో రాహుల్ మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలోని గిరిజన విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థులు పునాది బలపడేందుకు ఉద్దీపకం అనే వర్క్ బుక్ రూపొందించి విద్యార్థులకు అందించడం జరిగిందన్నారు. అదే విధంగా లెక్కలు, ఆంగ్లభాషలో నైపుణ్యం పెంపొందించేందుకు చర్యలు చేపట్టామన్నారు. ఐటీడీఏ పరిధిలో ప్రతిభా ప్రోత్సాహక పరీక్ష నిర్వహించి విద్యార్థుల ప్రతిభను వెలికి తీయడం జరిగిందన్నారు. 2024-25 విద్యా సంవత్సరంలో ప్రత్యేక అధికారుల పర్యవేక్షణ కారణంగా 93.5శాతం విద్యార్థులు పదోతరగతి పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించారని 26 గిరిజన విద్యాసంస్థలో నూరు శాతం ఫలితాలు వచ్చాయన్నారు. రాష్ట్ర స్థాయి గిరిజన క్రీడా పోటీలు ఉట్నూరులో ఇటీవల నిర్వహించగా భద్రాచలం జోన్ ఓవరాల్ చాంపియన్ షిప్ సాధించిందని పీవో రాహుల్ తెలిపారు. గిరిజన బీఈడీ కళాశాలలో బీఈడీ, డీఎడ్ కళాశాలలో నూరు ఫలితాలు సాధించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్, డీడీ ట్రైబల్ వెల్ఫేర్ అధికారి మణెమ్మ, ఏవో సున్నం రాంబాబు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో రాహుల్

కొండపల్లి ఉత్తమ్‌కుమార్‌కు ఘన నివాళి



ఖమ్మంలీగల్, జూన్2 (ఆంధ్రజ్యోతి): సీనియర్ న్యాయవాది కొండపల్లి ఉత్తమ్ కుమార్ నాలుగో వర్ధంతిని సోమవారం జిల్లా బార్‌అసోసియేషన్ హాల్లో నిర్వహించారు. ఉత్తమ్‌కుమార్ చిత్ర పటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బార్ కౌన్సిల్ సభ్యుడు, ఐలు రాష్ట్ర అధ్యక్షుడు కొల్లి సత్యనారాయణ, సీనియర్ న్యాయవాదులు, ఐలుజిల్లా, పట్టణ కమిటీ బాధ్యులు నివాళులర్పించారు.








ప్రతిజ్ఞ చేస్తున్న మేయర్, కమిషనర్, కార్పొరేటర్లు | జెండాకు వందనం చేస్తున్న మేయర్ నీరజ, కమిషనర్ అభిషేక్, జెండా ఆవిష్కరణ చేస్తున్న అదనపు కలెక్టర్ శ్రీజ, జడ్పీకార్యాలయంలో సీఈవో దీక్ష రైనా, కోర్టులో వందన సమర్పరణ చేస్తున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి



నేలకొండపల్లిలో ఎస్ఐ సంతోష్..



నేలకొండపల్లిలో ఎంపీడీవో ఎర్రయ్య



కాంగ్రెస్ జిల్లా కార్యాలయంలో..



సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్

రైజింగ్ ఖమ్మానికి ప్రజల భాగస్వామ్యం కావాలి

» మేయర్ పునుకొల్లు నీరజ, కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య

ఖమ్మం సంక్షేమవిభాగం, జూన్2(ఆంధ్రజ్యోతి): రైజింగ్ ఖమ్మానికి ప్రజల భాగస్వామ్యం కావాలని మేయర్ పునుకొల్లు నీరజ పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలను కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య ఆధ్వర్యంలో సోమవారం కేఎంసీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. నూతన పారిశుధ్య ట్రాక్టర్లను మేయర్ పునుకొల్లు నీరజ నడిపి ప్రారంభించారు. 'ఒకమార్పుఅభివృద్ధి మలుపు' నినాదంతో కార్పొరేటర్లు, ఉద్యోగులు, మెప్మా సిబ్బందితో కలిసి ప్రతిజ్ఞ చేశారు. పారిశుధ్య 100రోజుల ర్యాలీ నిర్వహించారు. కేఎంసీ కార్యాలయం ఎదుట మానవ హారం చేపట్టారు. నీరజ మాట్లాడుతూ అమర వీరుల ప్రాణత్యాగాలతో తెలంగాణ రాష్ట్రం ఏర్పడినా ఆ మేరకు పదేళ్లుగా అభివృద్ధి జరగలేదన్నారు. అందుకే కాంగ్రెస్ ప్రభుత్వం రైజింగ్ తెలంగాణ నినాదంతో వంద రోజులు అభివృద్ధి, పారిశుధ్య కార్యచరణ చేసిందన్నారు. రాష్ట్రంలోనే ఖమ్మం నగరం నెంబర్ 1 స్థానంలో నిలిపేందుకు అధికారులు, ప్రజలు సమష్టిగా పని చేయాలన్నారు. కమిషనర్ అభిషేక్ అగస్త్య 100 రోజులు అభివృద్ధి కార్యచరణ వివరించారు. ఈ కార్యక్రమాల్లో ఉప మేయర్ ఫాతిమా జోహరా, కార్పొరేటర్లు దుద్దుకూరి వెంకటేశ్వర్లు, రాపర్తి శరత్‌కుమార్, కమర్తపు మురళీ, కన్నం వైష్ణవిపసన్న, పాకాలపాటి విజయనిర్మల,దండా జ్యోతిరెడ్డి, ఏఎంసీ అహ్మద్ షఫీ ఉల్లా, ఈఈ కృష్ణలాల్, ఆర్వో శ్రీధర్, మెనేజరు బుచ్చిబాబు,పట్టణ ప్రణాళిక అధికారి గంధం వసుంధర, ఉద్యాన అధికారి బెల్లం రాధిక, డీఎంసీ సావల సుజాత, టీఎంసీ గుడిపూడి సుజాతరాణి, ఆర్ఐలు రామారావు, జ్యోతి, కవిత,శ్రీను,పారిశుధ్యపర్యవేక్షకుడు సాంబయ్య, సీవో ద్రౌపది, సంధ్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేయాలి

అదనపు కలెక్టర్లు శ్రీజ, శ్రీనివాసరెడ్డి

ఖమ్మం కలెక్టరేట్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కార లక్ష్యంగా ఉద్యోగులు సమష్టిగా కృషి చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పి.శ్రీజ అన్నారు. సోమవారం రాష్ట్రఅవతరణ దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్‌లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ప్రజలతో పాటు, ఉద్యోగులు, అన్ని వర్గాలవారి దశాబ్దాల పోరాటంతో తెలంగాణ రాష్ట్రం సిద్ధించిందని అన్నారు. అర్హులందరికీ ప్రభుత్వ ఫలాలు అందాలని, దీనికోసం అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి, జిల్లారెవెన్యూ అధికారిణి పద్మశ్రీ, ఎసీసీ ఎం.రాజేశ్వరి, కలెక్టరేట్ ఏవో ఎన్. అరుణ, వివిధశాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. అన్ని జిల్లా కార్యాలయాలు ప్రభుత్వ కార్యాలయాల్లో ఆవిర్భావ వేడుకలను నిర్వహించారు. జడ్పీ కార్యాలయంలో సీఈవో దీక్ష రైనా మువ్వన్నెల జెండాను ఆవిష్కరించారు. తొలుత జడ్పీలోని గాంధీ, అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. జడ్పీడిప్యూటీ సీఈవో నాగపద్మజ, పంచాయతీరాజ్ ఎస్ఈ వెకంటరెడ్డి, ఈఈ మహేష్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు. జలవనరులశాఖ జిల్లా కార్యాలయంలో ఎస్ఈ వెంకటేశ్వర్లు జాతీయ జెండాను ఆవిష్కరించారు. జిల్లా వైద్య కళాశాలలో ప్రిన్సిపాల్ రాజేశ్వరావు, జిల్లా జనరల్ ఆస్పత్రిలో డాక్టర్ ఎల్ కిరణ్‌కుమార్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. టీజీవో కార్యాలయంలో జిల్లాఅధ్యక్షుడు కస్తాల సత్యనారాయణ, టీఎన్జీవో కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు గుంటుపల్లి శ్రీనివాస్ జాతీయజెండాను ఎగురవేశారు. కొణిదెన శ్రీనివాస్, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.



తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేస్తున్న చిన్ని కృష్ణారావు



జెండా ఆవిష్కరిస్తున్న శ్రీకాంత్, పాపారావు










తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో, స్టేడియంలో, వ్యవసాయ మార్కెట్‌లో, టీఎన్జీవో ఫంక్షన్‌హాల్లో, టీజీవో కార్యాలయంలో, ప్రభుత్వ మెడికల్ కళాశాలలో జెండా ఆవిష్కరిస్తున్న దృశ్యం



సీపీఐ ఆధ్వర్యంలో




బీజేపీ ఆధ్వర్యంలో.. తిరుమలాయపాలెం పోలీస్ స్టేషన్‌లో జెండా ఆవిష్కరణ



కామేపల్లిలో జెండాను ఆవిష్కరణ చేస్తున్న తహసీల్దార్ సుధాకర్



కలెక్టరేట్‌లో వేడుకలకు హాజరైన అధికారులు, సిబ్బంది

ఇల్లు లేని ప్రతీ పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు



శంకుస్థాపనలో పాల్గొన్న దయాకర్‌రెడ్డి

నేలకొండపల్లి, జూన్2(ఆంధ్రజ్యోతి): ఇల్లు లేనిప్రతీపేదవాడికి ఖచ్చితంగా ఇందిరమ్మ ఇల్లు మంజూరవుతుందని కాంగ్రెస్ నాయకుడు తుంబూరు దయాకర్‌రెడ్డి చెప్పారు. మండల పరిధిలోని మంగ్రాజుపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి దయాకర్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో జిల్లానాయకుడు నెల్లూరి భద్రయ్య, ఏఎంసీ మాజీచైర్మన్ శాఖమూరి రమేష్, మాజీ ఎంపీపీ వజ్జా రమ్య, ఎస్సీ సెల్ జిల్లాఅధ్యక్షుడు బొడ్డు బొందయ్య, కొమరగిరి హనుమంతరావు, తాటికొండ కన్నయ్య, నర్రా పూర్ణచందర్‌రావు, నెల్లూరి అప్పారావు,మామిడి వెంకన్న పాల్గొన్నారు.

జేఈఈలో ఎస్ఆర్ విద్యార్థుల ర్యాంకుల మోత



విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

ఖమ్మంఖానాపురం హవేలీ, జూన్2 (ఆంధ్రజ్యోతి): సోమవారం ప్రకటించిన జేఈఈ అడ్వాన్స్ ఫలితాల్లో నగరంలోని ఎస్ఆర్ జూనియర్ కళాశాల విద్యార్థులు ర్యాంకుల మోత మోగించారని విద్యా సంస్థల చైర్మన్ వరదరెడ్డి తెలిపారు. కళాశాలకు చెందిన వినోద్ 115, సంతోష్ 265, వేణు 570, ఉపేందర్ 1310, నవీన్‌కుమార్ 1779, ఆకాష్ 1882, రవితేజ 2780 ర్యాంకులు సాధించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్స్ మధుకర్ రెడ్డి, సంతోష్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, విజమభాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేటినుంచి భూభారతి గ్రామసభలు

ఖమ్మంరూరల్, జూన్2(ఆంధ్రజ్యోతి): భూభారతి గ్రామసభలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రూరల్ తహసీల్దార్ రాంప్రసాద్ సూచించారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలోమాట్లాడారు. మండలంలో మంగళవారం బారుగూడెం, పల్లెగూడెం గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఆర్ఐలు ప్రసాద్, క్రాంతి, సిబ్బంది పాల్గొన్నారు.

భూ సమస్యలు పరిష్కరించుకోండి

భూభారతిలో ఏమైనా భూసమస్యలు ఉంటే రైతులు పరిష్కరించుకోవాలని ఆంధ్ర బ్యాంక్ సోసైటీ వైస్ చైర్మన్ తమ్మినేని విజయలక్ష్మీ తెలిపారు. జూన్ 3నుంచి రూరల్ మండలంలోని అన్నిగ్రామాల్లో నిర్వహించబోయే సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ప్రాణాలడ్డు పెట్టి.. కార్యకర్తలను కాపాడుకుంటా

మాజీ ఎమ్మెల్యే కందాళ

నేలకొండపల్లి, జూన్2(ఆంధ్రజ్యోతి): ప్రాణాలను అడ్డు పెట్టైనా కార్యకర్తలను కాపాడుకుంటానని పాలేరు మాజీ శాసనసభ్యుడు కందాల ఉపేందర్‌రెడ్డి కార్యకర్తలకు భరోసా ఇచ్చారు. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం మండల పరిధిలోని కొత్తకొత్తూరులో నూతనంగా నిర్మించిన జెండా దిమ్మెను ఆవిష్కరించారు. అనంతరం కార్యకర్తలను ఉద్దేశించి కందాళమాట్లాడారు. కాంగ్రెస్ పాలనలో ఎవరూ సంతోషంగా లేరన్నారు. పాలేరులో 10శాతం ప్రజలే శ్రీనివాసరెడ్డికి మద్దతుగా ఉన్నారని, మిగిలిన90శాతం మనకే అనుకూలంగా ఉన్నారని చెప్పారు. మీరు ఒకటి కొడితే...మేం రెండు కొడతాం...రెండు కొడితే ఆరు కొడతామంటూ కాంగ్రెస్ కార్యకర్తలను ఉద్దేశించి తీవ్రంగా హెచ్చరించారు. కార్యకర్తలకు అండగా నిలుస్తానని, పేదలకు సహాయం చేస్తానన్నారు. రాజకీయాలు శాశ్వతం కాదని, మన మంచితనమే శాశ్వతమన్నారు. తొలుత కొత్తకొత్తూరు నుంచి నేలకొండపల్లి వరకు ద్విచక్రవాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఉన్నం బ్రహ్మయ్య కార్యదర్శి యెన్నెబోయిన శ్రీను, డీసీఎమ్మెస్ డైరెక్టర్ డాక్టర్ నాగుబండి శ్రీనివాసరావు, రూరల్ మండల అధ్యక్షుడు బెల్లం వేణు, తిరుమలాయపాలెం మాజీజడ్పీటీసీ వరప్రసాద్, మాజీ జడ్పీఉపాధ్యక్షురాలు మరికంటి ధనలక్ష్మి, పీఏసీఎస్ అధ్యక్షుడు కోటి సైదారెడ్డి, నాయకులు షేక్.హుస్సేన్, సాగి రామారావు, గొలుసు రవి, యాతాకుల భాస్కర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీఎమ్మెల్యే కందాళ

అన్ని రంగాల్లో నగరం సమగ్రాభివృద్ధి

» వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
» 178 ఎస్‌హెచ్‌జీలకు రూ.10 కోట్ల బ్యాంకు లింకేజీ
» రైతులకు సబ్సిడీపై విత్తనాల పంపిణీ



బ్యాంకు లింకేజీ చెక్కును పంపిణీ చేస్తున్న మంత్రి తుమ్మల, మేయర్ నీరజ

ఖమ్మంసంక్షేమవిభాగం, జూన్2(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో సమగ్రాభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్తున్నట్లు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. సోమవారం ఖమ్మం భక్తరామదాసు కళాక్షేత్రంలో నియోజకవర్గ స్థాయి రాష్ట్రఅవిర్భావ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు.భక్తరామదాసు కళాక్షేత్రం మహిళా స్వయం సహాయక సంఘాలు, నాయకులు, కార్యకర్తలతో కిక్కిరిసిపోయింది. ఈసందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వంద రోజులు కార్యచరణలో భాగంగా ఖమ్మంలోని 178 మహిళా స్వయం సహాయక సంఘాలకు రూ.10కోట్లు బ్యాంకు లింకేజీలను పంపిణీ చేశారు. రఘునాథపాలెం మండలంలోని రైతులకు సబ్సిడిపై విత్తనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మేయర్‌పునుకొల్లు నీరజ, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, ఖమ్మం ఏఎంసీ చైర్మన్ యరగర్ల హనుమంతరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ మానుకొండ రాధాకిషోర్, కార్పొరేటర్లు గజ్జల లక్ష్మీ, కమర్తపు మురళీ, దుద్దుకూరి వెంకటేశ్వర్లు, రఘునాథపాలెం మండల కాంగ్రెస్ కన్వీనర్ వాంకుడోత్ దీప్లానాయక్ ఎన్టీఆర్ స్ఫూర్తితో రాజకీయాల్లోకి వచ్చిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఓట్లు కోసం ఏనాడు ఆశించకుండా ప్రజలకు మౌళిక సౌకర్యాలు, అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల కోసం 40ఏళ్లుగా కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా పార్వతి, వనితశ్రీ, గాయాత్రి, శ్రీసాయి స్వశక్తి, శ్రీవిద్యా, క్రాంతి, రాజరాజేశ్వరి స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో మహిళా ఉత్పత్తి కేంద్రాలను ఏర్పాటు చేశారు. మేయర్ పునుకొల్లు నీరజ కార్పొరేటర్లు స్టాల్స్ పరిశీలించి కొనుగోలు చేశారు.జెడ్పీ సీఈవో దీక్షారైనా, డిప్యూటీ సీఈవో నాగపద్మజ, అసిస్టెంట్ కమిషనర్ అహ్మద్‌షఫీ ఉల్లా, మెప్మా టీఎంసీ గుడిపూడి సుజాతరాణి, పారిశుధ్య సూపర్‌వైజర్ సాంబయ్య,సీవోలుచిలకా ద్రౌపది, సల్మా,బొల్లికొండ రోజా, సిబ్బంది మేకల సంధ్య, రాయల వెంకటేశ్వర్లు, ఆర్పీలు పాల్గొన్నారు.

పశువుల రవాణాలో నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

అదనపు డీసీపీ ప్రసాద్‌రావు

ఖమ్మంరూరల్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): పశువుల రవాణా విషయంలో నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు ఉంటాయని అదనపు డీసీపీ ప్రసాద్‌రావు పేర్కొన్నారు. ఏదులాపురం మునిసిపాలిటీ పరిధిలోని వెంకటగిరి క్రాస్‌రోడ్డులో ఏర్పాటు చేసిన చెక్ పోస్టును సోమవారం తనిఖీ చేశారు. అక్రమ రవాణా నియంత్రించేందుకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన చెక్ పోస్టులలో 24గంటలు నిరంతర పర్యవేక్షణ ఉంటుందన్నారు. పశువులను రవాణా చేసే ప్రతీ వాహనానికి తగు పత్రాలు ఉండాలని సిబ్బందికి సూచించారు. పోలీసులు మినహా ఏ సంస్థలు కార్యకర్తలు వాహనాలను స్వయంగా అడ్డుకుంటే ఉపేక్షించేది లేదన్నారు. నిబంధనలకు విరుద్ధంగా అక్రమరవాణా జరిగితే స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. బక్రీద్ పర్వదినాన్ని మత సామరస్యంతో జరుపుకునేలా అవసరమైన చోట్ల కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ తిరుపతి రెడ్డి, సీఐ రాజు తదితరులు పాల్గొన్నారు.



వెంకటగిరి చెక్ పోస్టు వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న డీసీపీ

ఘనంగా రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు


సత్తుపల్లిలో గాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే రాగమయి

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు సోమవారం ఆయా నియోజకవర్గాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు కార్యాలయాల్లో జాతీయ పతాకాలను ఎగురవేశారు. సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి క్యాంపు కార్యాలయంలో, వైరాలో ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్, మధిర కోర్టులో న్యాయాధికారి ప్రశాంతి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అమరుల స్థూపం వద్ద నివాళులర్పించారు. ఆయా గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించారు. సోనియాగాంధీ ప్రత్యేక శ్రద్ధతోనే తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిందని పేర్కొన్నారు. మిగులుతో ఉన్న రాష్ట్రాన్ని కేసీఆర్ అప్పుల కుప్పగా మార్చారని పేర్కొన్నారు. పలువురు నాయకులు పాల్గొన్నారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో జాతీయ జెండాలను ఆవిష్కరించారు.


వైరాలో....


పెనుబల్లిలో...


మధిర కోర్టులో జాతీయ జెండా ఎగురవేస్తున్న న్యాయాధికారి


ముదిగొండలో...


ఏన్కూరులో...


కొణిజర్లలో...


వేంసూర్‌లో....

మండలాలు అభివృద్ధిలో ముందుండాలి

» ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క


అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

చింతకాని, జూన్ 2(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రాలు అభివృద్ధిలో ముందుండాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. సోమవారం మండల కేంద్రంలో రూ.16 కోట్ల అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. మండల కేంద్రంలో సెంట్రల్ లైటింగ్‌తో పాటు చింతకాని నుంచి పెద్దగోపతి వరకు చేపట్టనున్న రోడ్డు అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, అంబటి వెంకటేశ్వర్లు, మడిపల్లి భాస్కర్, కన్నెబోయిన గోపి, కొప్పుల గోవిందరావు, బందెల నాగార్జున, కిలారు మనోహర్‌బాబు, కూరపాటి కిషోర్, కంచుమర్తి రామకృష్ణ, అప్పారావు పాల్గొన్నారు.

విద్యా సంవత్సరం త్వరలో ప్రారంభంకానున్న సందర్భంగా విద్యార్థుల సౌకర్యార్థం ఖమ్మం నుంచి చింతకానికి బస్ సర్వీస్‌ను పునఃప్రారంభించాలని మహిళలకు ఉపముఖ్యమంత్రికు వినతిపత్రం సమర్పించారు.

జాలిముడి ప్రాజెక్టు సందర్శన

మధిరరూరల్, జూన్2(ఆంధ్రజ్యోతి): జాలిముడి వద్ద గలత సాగునీటి ప్రాజెక్టును సోమవారం డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క సందర్శించారు. ఈకార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన

మధిరరూరల్ జూన్2(ఆంధ్రజ్యోతి): మండలంలోని మటూరు గ్రామంలో రూ.2.60కోట్లతో నూతనంగా నిర్మించే 11/33కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణ పనులకు సోమవారం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క శంకుస్థాపన చేశారు. ఈకార్యక్రమంలో విద్యుత్ ఎస్ఈ ఇనుగుర్తి శ్రీనివాసాచారి, వైరా డివిజన్ డీఈ బండి శ్రీనివాసరావు, కన్‌స్ట్రక్షన్ డీఈ కె.హీరాలాల్, ఏడీఈ కిరన్‌చక్రవర్తి, సీవిల్ ఈఈ జి.వెంకటేశ్వర్లు, సివిల్ ఏడీఈ శ్రీనివాస్, మధిర సబ్‌డివిజన్ ఏడీఈ అనురాధ, సెక్షన్ ఏఈ ఎస్ మైథిలి పాల్గొన్నారు.

నాలుగేళ్లలో అందరికీ ఇందిరమ్మ ఇళ్లు

» ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్


విప్పలమడకలో విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

వైరా, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ రాజ్యంలో ఈ నాలుగేళ్ల కాలంలో నియోజకవర్గంలోని అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు చేస్తామని వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ స్పష్టం చేశారు. వైరా నియోజకవర్గంలోని ఐదుమండలాలకు చెందిన లబ్ధిదారులకు సోమవారం వైరాలోని కమ్మవారి కల్యాణ మండపంలో ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. మొదటి దశలో నియోజకవర్గ వ్యాప్తంగా 3500 మందికి ఇళ్ల మంజూరు చేస్తున్నామని అన్నారు. నియోజకవర్గ ప్రత్యేక అధికారి రాంబాబు, రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్‌చైర్మన్ బొర్రా రాజశేఖర్, ఐదుమండలాల కాంగ్రెస్ అధ్యక్షులు శీలం వెంకటనర్సిరెడ్డి, వడ్డే నారాయణ, స్వర్ణ నరేందర్, తలారి చంద్రప్రకాష్, మంగీలాల్‌నాయక్, టీపీసీసీ కార్యదర్శి కట్ల రంగారావు, ఏదునూరి సీతరాములు, తదితరులు పాల్గొన్నారు.

వైరా ఆయకట్టుకు నీళ్లిస్తాం

వైరా, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): గతంలో మునుపెన్నడూ లేనివిధంగా వైరా రిజర్వాయర్ ఆయకట్టులో వరిసాగుకు ఈనెలలోనే నీళ్లిస్తామని ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ ప్రకటించారు. మండలంలోని విప్పలమడక గ్రామంలో సోమవారం వ్యవసాయశాఖ, వ్యవసాయ యూనివర్సిటీ చేపట్టిన విత్తు కొద్దీ పంట కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ వేసవి కాలంలో కూడా రిజర్వాయర్‌లో 15అడుగుల నీటిమట్టం ఉండేలా అన్ని చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్‌చైర్మన్ బొర్రా రాజశేఖర్, పూసలపాడు సొసైటీ అధ్యక్షుడు గాలి శ్రీనివాసరావు, టీపీసీసీ కార్యదర్శి కట్ల రంగారావు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శీలం వెంకటనర్సిరెడ్డి, మాజీ ఎంపీటీసీ మచ్చా వెంకటేశ్వరరావు, పాల్గొన్నారు.

ఎల్‌హెచ్‌పీఎస్ సభను విజయవంతం చేయాలి


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న రాజేష్‌నాయక్, కృష్ణనాయక్

కల్లూరు, జూన్2 (ఆంధ్రజ్యోతి): ఖమ్మంలో ఈ నెల 8న జరగనున్న ఎల్‌హెచ్‌పీఎస్ సభను విజయవంతం చేయాలని మండల పరిధిలో గల హనుమాతండాలో సోమవారం కరపత్రంను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు రాజేష్‌నాయక్, కృష్ణనాయక్‌లు మాట్లాడుతూ గిరిజన హక్కుల సాధన కోసం రాష్ట్ర స్థాయిలో ఉద్యమ కార్యాచరణ సభను ఖమ్మంలో నిర్వహించటం జరుగుతుందన్నారు. తెలంగాణలో ప్రభుత్వం నిర్వహించిన కులగణనలో లంబాడీల జనాభాను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. గోర్‌బోలి భాషను అధికారికంగా గుర్తించి కేంద్ర ప్రభుత్వం 8వ షెడ్యూల్‌లో చేర్చాలన్నారు. సేవాలాల్ మహరాజ్ జయంతిని సాధారణ సెలవుదినంగా ప్రభుత్వం ప్రకటించాలని వారు కోరారు. నిరుద్యోగులకు ప్రకటించిన జాబ్ క్యాలెండర్ ప్రకారం ఉద్యోగాల భర్తీ చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ధర్మసోత్ దశరథ్‌నాయక్, మండల అధ్యక్షుడు నందు నాయక్, తల్లాడ మండల అధ్యక్షుడు రవి నాయక్, ప్రధాన కార్యదర్శి రామారావునాయక్, శ్రీను నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మండలంలో ఎమ్మెల్యే రాగమయి పర్యటన


ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన, చేస్తున్న ఎమ్మెల్యే రాగమయి

తల్లాడ, జూన్2(ఆంధ్రజ్యోతి): తల్లాడ మండలంలో సత్తుపల్లి ఎమ్మెల్యే మాట్టా రాగమయి సోమవారం పర్యటించారు. మండలలంలోని బిల్లుపాడు గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. స్థానిక ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఉచితంగా దుస్తులు, నోటుపుస్తకాలు అందించారు. మల్లవరంలో ఇటీవల మరణించిన దాసరి శోభారాణి కుటుంబాన్ని పరామర్శించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ సురేష్‌కుమార్, ఎంపీడీవో సురేష్‌బాబు, ఏపీఎం అశోకాటాని, సొసైటీచైర్మన్ తూము వీరభద్రరావు, దగ్గు ల రఘుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు ..

ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని నిరసన


నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు

కారేపల్లి, జూన్2(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పేరుపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో ఇండ్లు లేని నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కోరుతూ సోమవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద మోకాళ్లపై కుర్చుని మహిళలు నిరసన చేపట్టారు. జిల్లా అంబేద్కర్ సేనా కన్వీనర్ పప్పుల నిర్మల ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. కార్యక్రమంలో గ్రామస్థులు పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చడంలో ప్రభుత్వం విఫలం



సమావేశంలో మాట్లాడుతున్న రాంబాబు

మధిరరూరల్ జూన్2(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం రైతాంగానికి ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో విఫలం చెందిందని రైతుసంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు ఆరోపించారు. సోమవారం మండలంలోని సిరిపురం గ్రామంలో జరిగిన రైతుసదస్సులో అయన మాట్లాడారు. ఈకార్యక్రమలో పాపినేని రామనరసయ్య, రైతు సంఘంజిల్లా అధ్యక్షుడు మాదినేని రమేష్, మడుపల్లి గోపాలరావు, శీలం నరసింహారావు, మురళి, తేలపోలు రాధాకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ తల్లికి వినతి

పెనుబల్లి, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మాజీ సర్పంచ్‌ల సంఘం పిలుపు మేరకు గ్రామపంచాయతీల్లో పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని కోరుతూ సోమవారం అడవిమల్లెల గ్రామంలో పల్లె ప్రకృతి వనంలోని తెలంగాణ తల్లి విగ్రహానికి మండల సర్పంచ్‌లు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు మందడపు అశోక్‌కుమార్, గోదా చెన్నారావు, కోమటి ప్రసాద్, దొడ్డపనేని రవి తదితరులు పాల్గొన్నారు.

నూతన వ్యవసాయ మార్కెట్ విధానాన్ని రద్దు చేయాలి

» పౌరహక్కుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రవి



సమావేశంలో మాట్లాడుతున్న రవి

సత్తుపల్లి, జూన్ 2 (ఆంధ్రజ్యోతి):నూతన వ్యవసాయ మార్కెట్ విధానం రద్దు చేయాలని, వ్యవసాయ రంగంలో స్వామినాథన్ సిఫారసులను అమలు చేయాలని పౌరహక్కుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కూకలకుంట రవి అన్నారు. సోమవారం ఏఐయూకేఎస్ సత్తుపల్లి మండల ప్రథమ మహాసభ సత్యంపేటలోని కొరసన్న నగర్‌లో జరిగింది. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ గిట్టుబాటు ధరలను పార్లమెంట్‌లో చట్టం చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు విధానాలను ఎండగట్టేందుకు ఉద్యమించాలని కోరారు. మోదీ అధికారంలోకి రాకముందు స్విస్ బ్యాంకులో నల్లధనం తెచ్చి రూ.15లక్షల చొప్పున దేశ ప్రజల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తామని నమ్మించి మోసం చేశారని విమర్శించారు. నూతన వ్యవసాయ మార్కెట్ విధానం గతంలో కేంద్ర ప్రభుత్వం చేసిన రైతు వ్యతిరేక చట్టాలకు భిన్నం కాదన్నారు. గిరిజనుల ఆక్రమణల్లో ఉన్న భూములకు పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. మహాసభలో మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు గంపకేశ్వరరావు, గుండ పోలయ్య, జువ్వాజి చిన్నభద్రం, తాటి ముత్యాలు, హనుమంతరావులు పాల్గొన్నారు.

కల్లూరులో ఒక చర్య, ఒక మార్పు

కల్లూరు, మే2 (ఆంధ్రజ్యోతి) కల్లూరు పట్టణంలో సోమవారం స్థానిక పురపాలక సంఘం ఆధ్వర్యంలో ఒక చర్య, ఒక మార్పు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పురపాలక మేనేజర్ నందిశెట్టి నాగేశ్వరరావుతోపాటుగా కాంగ్రెస్ నాయకులు, పురపాలక సిబ్బందిలు స్థానిక మెయిన్ సెంటర్‌లో ప్రదర్శన, 100 రోజుల ప్రణాళికపై ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ బాగం నీరజదేవి, కాంగ్రెస్ నాయకులు బాగం ప్రభాకర్‌చౌదరి, ఎస్కె బాజీ, బైర్ల కాంతరావు, ఎనుముల రాము, ఆళ్ల నరిసింహారావు తదితరులు పాల్గొన్నారు.

బాధిత రైతుల ర్యాలీ

వైరా, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): కావేరి విత్తన కంపెనీ బాధిత రైతులు సోమవారం వైరాలో ర్యాలీ నిర్వహించారు. నాలుగునెలలు కష్టపడి పంట పండించి కంపెనీ యజమాన్యానికి పంట అప్పగించినా రెండు నెలల నుంచి డబ్బులు ఇవ్వడం లేదని రైతులు వాపోయారు. ర్యాలీగా వెళ్లి క్యాంపు కార్యాలయంలో ఉన్న ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్‌ను బాధిత రైతులు కలిసి తమ గోడును చెప్పుకున్నారు. కంపెనీ ఏజెంట్ చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల సమస్యలు ఆలకించిన ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు. తెలంగాణ రైతుసంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు పాల్గొన్నారు.

జేఈఈ అడ్వాన్స్‌డ్ ర్యాంకర్‌కు సన్మానం


ర్యాంకర్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

వైరా, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): న్యూఇరా వారి న్యూలిటిల్‌ఫ్లవర్ ఫౌండేషన్‌కు చెందిన జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో ఉత్తమ ర్యాంకులు సాధించిన వారిని ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ సన్మానించారు. వైరాలోని తమ క్యాంపు కార్యాలయంలో వి.కుశాల్ 165వ ర్యాంకు, ఎం.నాగయశ్వంత్ 393ర్యాంకు, రాహుల్‌దేవ్ 4068ర్యాంకర్లను ఎమ్మెల్యే సన్మానించారు. న్యూలిటిల్‌ఫ్లవర్ పాఠశాల కరస్పాండెంట్ కరస్పాండెంట్ డాక్టర్ పి.భూమేశ్వరరావు, డైరెక్టర్ కుర్రా సుమన్, ప్రిన్సిపాల్ భువన ప్రసాద్ పాల్గొన్నారు.

మధిర విద్యార్థులకు ర్యాంకులు

మధిరరూరల్ జూన్2(ఆంధ్రజ్యోతి): జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష ఫలితాల్లో మధిరకు చెందిన ఇద్దరు విద్యార్థులు తుమ్మల ఆకాంక్ష జాతీయస్థాయిలో 1,183 ర్యాంకు, సాగి శశాంక్ 3,354 ర్యాంకు సాధించారు. ప్రతిభ సాధించిన కళాశాల యాజమాన్యాలు, తదితరులు అభినందించారు.

కారేపల్లి ఎస్ఐగా గోపి



కారేపల్లి, జూన్2(ఆంధ్రజ్యోతి): మండల నూతన ఎస్ఐగా భైరు గోపి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఎస్ఐ పనిచేసిన ఎన్.రాజారాంపై పలు ఆరోపణల నేపథ్యంలో ఎక్కడ పోస్టింగ్ ఇవ్వకుండా ఖమ్మం సీపీ ఆఫీస్‌కు బదిలీ చేశారు. మహబూబాబాద్ జిల్లాలో పనిచేస్తున్న భైరు గోపిని కారేపల్లి మండలానికి బదిలీ చేశారు. ఈసందర్భంగా సోమవారం బాధ్యతలు స్వీకరించారు.

మండల గృహనిర్మాణశాఖ అధికారిగా నాగేందర్

కారేపల్లి, జూన్2(ఆంధ్రజ్యోతి): మండల గృహనిర్మాణశాఖ అధికారిగా నాగేందర్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈసందర్భంగా నాగేందర్ మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో ఎలాంటి అక్రమాలకు తావులేకుండా చూస్తానన్నారు.

బొగ్గు లోడింగ్ ఇవ్వడం లేదంటూ ఆందోళన

సత్తుపల్లి, జూన్ 2 (ఆంధ్రజ్యోతి):సత్తుపల్లి మండలం కిష్టారం ఓసీ, జేవీఆర్ ఓసీలను నుంచి స్థానిక లారీలకు బొగ్గు లోడింగ్ ఇవ్వటం లేదని ఆరోపిస్తూ సత్తుపల్లి లారీ, టిప్పర్ యజమానుల అసోసియేషన్ అధ్వర్యంలో సోమవారం లారీ యజమానులు నిరసన వ్యక్తం చేసారు. ఆందోళనలో భాగంగా అసోసియేషన్ లారీలను కిష్టారం ఓసీ నుంచి బొగ్గు రవాణా జరగకుండా అడ్డుగా పెట్టారు. కార్పొరేట్ లారీలకు బొగ్గు లోడింగ్ ఇస్తూ స్థానిక లారీలకు బొగ్గు లోడింగ్ ఇవ్వడం లేదని ఆరోపించారు.

ఎన్జీటీ నిబంధనలు పాటించని వైనం

రోడ్డు మార్గం ద్వారా బొగ్గు రవాణా చేయవద్దని జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాలు ఇచ్చిందని స్థానిక లారీ యజమానులకు తెలిపిన సింగరేణి అధికారులు ఆంధ్రాకు చెందిన ట్రాన్స్‌పోర్టు కాంట్రాక్టరుకు బొగ్గురవాణా కాంట్రాక్టు ఇచ్చారని, రోజుకు సగటున పదివేల టన్నుల బొగ్గు లారీల ద్వారా ఆర్‌సీహెచ్‌పీకి రవాణా చేస్తున్నారని లారీ యజమానులు చెప్పారు. స్థానిక లారీ యజమానులకు ఎన్జీటీ నిబంధనలు సాకు చూపుతున్న అధికారులు ఆంధ్రా కాంట్రాక్టర్లకు బొగ్గు రవాణా ఇవ్వడం ద్వారా ఎన్జీటీ నిబంధనలు వర్తించవా అని ప్రశ్నించారు.


కిష్టారం ఓసీలో దారికి అడ్డుగా ఉంచిన లారీలు

బొగ్గు నాణ్యతలో తేడాలు...

అధికారులు అక్రమాలకు పాల్పడటం, బొగ్గు కొనుగోలు దారులకు సత్తుపల్లి ఓసీల నుంచి నాణ్యమైన బొగ్గు ఇవ్వకపోటం వల్లనే బొగ్గు కొనుగోలు దారులు ఇక్కడ బొగ్గు కొనేందుకు ముందుకు రావడం లేదని, ఇతర రాష్ట్రాల నుంచి కొనుగోలు చేసుకుంటున్నారని ఆరోపించారు. కర్నాటక మిల్క్ ప్రాజెక్టుకు అయిదు వేల టన్నుల ఇండెంట్ పెట్టినా స్థానిక లారీలకు లోడింగ్ ఇవ్వడం లేదని, అధికారులను అడిగితే కొత్తగూడెం నుంచి కర్నాటకకు పంపుతామని చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బొగ్గురవాణా సమయంలో స్థానిక లారీలు పాటిస్తున్న నిబంధనలను కార్పొరేట్ లారీలకు పాటించడం లేదని అయినా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. లారీ డ్రైవర్ లైసెన్స్, లారీ కండిషన్, బొగ్గులోడ్‌పై టార్పాల్ లాంటి విషయాలు పరిశీలించాల్సి ఉన్నా అవేమీ కాంట్రాక్టర్ పట్టించుకోవడం లేదని ఆరోపించారు. లారీ యజమానులు, సింగరేణి పీవోలు ప్రహ్లాద్, నరసింహారావులు స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో చర్చలు జరిపారు. రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్ సమక్షంలో చర్చలు జరిపారు. ఆర్‌సీహెచ్‌పీకి కాంట్రాక్టు సంస్థ ద్వారా బొగ్గు రవాణా వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. చివరికి రెండు నెలల్లో స్థానిక లారీలకు లోడింగ్ ఇస్తామని సింగరేణి అధికారులు ఇచ్చిన హామీ మేరకు అడ్డు పెట్టిన లారీలను తొలగించారు.